PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu


సంపుటి : 44 సంచిక : 26 | విజయవాడ, సోమవారం 26 ఆగస్టు 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 26 August 2024 | Rs

తెలుగు భాషా సేవలో ఆ ఇద్దరు

4



యువ ఛాంప్ తన్వీ

- అండర్-15 విజేతగా తన్వీ పత్రి
- ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్

6

సంజయ్‌కు పాలిగ్రాఫ్ టెస్ట్

• మరో ముగ్గురికి కూడా.. • మాజీ ప్రిన్సిపాల్ ఇంట్లో సిబిఐ సోదాలు

కొల్‌కతా : కొల్‌కతాలో ఆర్‌జి కర్ మెడికల్ కళాశాలలో హాలులో 31 ఏళ్ల ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కు, మరో ముగ్గురికి పాలిగ్రాఫ్ టెస్ట్ (అబద్ధాలను తెలుసుకునే పరీక్ష) నిర్వహించారు. ఢిల్లీలోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (సిఎఫ్‌ఎస్‌ఎల్) నుంచి కొల్‌కతాకు చేరుకున్న నిపుణుల బృందం ఆదివారం కొల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైలుకు చేరుకుని మొదట ఈ కేసులో ప్రధాన నిందితుడైన సంజయ్‌కు లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించింది. అలాగే ఆర్‌జి కర్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్‌ఘోష్‌కు మరో ఇద్దరికి కొల్‌కతాలోని సిబిఐ కార్యాలయంలో ఈ పరీక్ష నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో సందీప్ ఘోష్ సహా ఏడుగురికి లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించేందుకు సిబిఐ కోర్టు అనుమతి కోరింది. విచారణ సమయంలో ఈ పరీక్ష ద్వారా సేకరించిన వివరాలు సాక్ష్యాలుగా కోర్టులు పరిగణించవు. అయినా తదుపరి దర్యాప్తునకు ఈ ఫలితాలు ఉపకరిస్తాయని సిబిఐ అధికారులు భావిస్తున్నారు. ఘటన అనంతరం తానే దారుణానికి ఒడిగట్టినట్లు అంగీకరించిన సంజయ్‌రాయ్ పాలిగ్రాఫ్ టెస్ట్‌కు ముందు తాను నిర్దోషినని, తనను ఇందులో ఇరికించారని చెప్పడం గమనార్హం.



మెడికోపై అత్యాచారం, హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బెంగాల్‌లోని తూర్పు మేదినిపూర్ జిల్లా నిమ్మటూరులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, రైతులు, యువత

మాజీ ప్రిన్సిపాల్ ఇంట్లో సిబిఐ సోదాలు

కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ నివాసంతోసహా 15 ప్రదేశాల్లో సిబిఐ అధికారులు ఆదివారం సోదాలు నిర్వహించారు. ఘోష్ ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో ఆస్పత్రిలో ఆర్థిక అవతవకలకు పాల్పడ్డారని అధికారులు తెలిపారు. సుమారు ఏడుగురు సిబిఐ అధికారులు ఆదివారం ఉదయం 8 గంటల నుండి బెలియాఘట నివాసంలో ఘోష్‌ని విచారిస్తోంది. కేంద్ర భద్రతా బలగాలతో అధికారులు ఉదయం 6 గంటలకు ఘోష్ నివాసానికి చేరుకున్నారు. సుమారు గంటన్నరపాటు అధికారులు వేచిచూసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరో సిబిఐ అధికారుల బృందం ఆస్పత్రిలోని ఘోష్ కార్యాలయంలో సోదాలు నిర్వహించింది. ఇన్‌స్టిట్యూట్ క్యాంటీన్‌ను కూడా పరిశీలించింది. పేషెంట్లకు అవసరమైన సామాగ్రిని సరఫరా చేసేవారి నివాసాలు, కార్యాలయాలపై సిబిఐకి చెందిన అవినీతి నిరోధక విభాగం దాడులు చేస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మాజీ మెడికల్ సూపరింటెండెంట్, ఆస్పత్రి వైస్ ప్రిన్సిపాల్ వశిష్ట్, వైద్య సంస్థ ఫోరెన్సిక్ విభాగానికి చెందిన మరో ప్రొఫెసర్, ఇతరులను కూడా విచారిస్తున్నట్లు పేర్కొన్నాయి.

ఈనెల 9న ఆర్‌జికర్ ఆస్పత్రిలో చోటుచేసుకున్న అమానవీయ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారి తీసిన సంగతి విదితమే. ఈ ఘటనపై రాష్ట్ర పోలీసులతో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు తీరుపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. దీంతో ఆ కేసును రాష్ట్ర హైకోర్టు సిబిఐకి బదిలీ చేసింది.

ఆర్‌జి కర్ ఆస్పత్రిలో గతంలో పని చేసిన డిప్యూటీ సూపరింటెండెంట్ అక్తర్ అలీ.. సందీప్ ఘోష్‌పై తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో సందీప్‌పై మరిన్ని కేసులు నమోదయ్యాయి. వాటిని కూడా న్యాయస్థానం సిబిఐకి బదిలీ చేసింది. మూడు వారాల్లోగా దర్యాప్తునకు సంబంధించి స్టేటస్ రిపోర్టును సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.

ఆర్‌జి కర్ ఆసుపత్రి వద్ద నిషేధాజ్ఞలను ఈ నెల 31 వరకూ పొడిగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.



కాకినాడ జిల్లా పిఠాపురం రాపర్తి గ్రామం వద్ద ఏలేరు ప్రధాన కాలవలో పేరుకుపోయిన తూడు

నీటి సంఘాల ఎన్నికలు ఎప్పుడో!

- నాలుగున్నరేళ్లుగా నిలిచిన ప్రక్రియ
- అభివృద్ధికి నోచని సాగునీటి వనరులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

సాగునీటి సంఘాల పదవీ కాలం 2020 మార్చితో ముగిసింది. అప్పటి నుంచి వీటికి ఎన్నికలు నిర్వహించలేదు. ఫలితంగా సాగునీటి వనరుల నిర్వహణ ముందుకు సాగక రైతులు ఇబ్బందు పడుతున్నారు. సాగు నీరు అందే క్రమంలో చెరువులు, కాలువలు, ఆయకట్టు పరిధిలో ఏ చిన్న సమస్య వచ్చినా నీటి సంఘాల ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించేవారు. సాగు నీరందని పరిస్థితుల్లో త్వరితగతిన పనులు చేపట్టే అవకాశం ఉండేది. ప్రభుత్వం త్వరితగతిన ఎన్నికలు నిర్వహించి అస్తవ్యస్తంగా ఉన్న కాలువలను అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. రైతులకు సక్రమంగా సాగునీటిని అందించేందుకు, డ్రెయిన్లు, పంట కాలువల అభివృద్ధికి, పర్యవేక్షణకు 1997లో అప్పటి ప్రభుత్వం నీటి సంఘాలను ఏర్పాటు చేసింది. ఆయా కాలువల పరిధిలోని రైతులకు ఓటు హక్కు కల్పించి ఎన్నిక నిర్వహించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 401 నీటి సంఘాలు ఉన్నాయి. 2015 సెప్టెంబరులో అప్పటి టిడిపి ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో నీటి సంఘాల పాలకవర్గాలను నియమించింది. ఇవి ఏకపక్షంగా జరిగాయంటూ కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు. నామినేటెడ్ పాలక పాలక వర్గాలకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు ఇచ్చింది. అయినా, అప్పటి టిడిపి ప్రభుతం ఎన్నికలు నిర్వహించలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నీటి సంఘాలకు త్రీమ్యాన్ కమిటీలను వేసింది. 2020 మార్చి వరకూ ఇవి కొనసాగాయి. నీటిపారుదల వ్యవస్థ పర్యవేక్షణలో సాగునీటి సంఘాలు కీలకంగా వ్యవహరించేవి. చెరువులు, కాలువల్లో పూడికతీత, తూముల నిర్మాణం, ఆధునీకరణ పనులు, పొలాలు ముంపునకు గురికాకుండా చూడడం వంటివి ఈ సంఘాలు చేసేవి. రూ.5 లక్షల్లోపు పనులను సంఘాలే నామినేషన్ పద్ధతిలో చేయించేవి. ప్రస్తుతం వీటికి ఎన్నికలు నిర్వహించకపోవడంతో చిన్న సమస్యల పరిష్కారానికి సైతం అధికారులపైనే ఆధారపడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ శాఖాధికారులకు బాధ్యతలు అప్పగించడంతో ప్రతి పనికి వారే అంచనాలు రూపొందించి టెండర్లు పిలవాల్సి వస్తోంది. దీనివల్ల పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది.

ఎన్నికలు త్వరితగతిన నిర్వహించాలి

సాగునీటి కాలువల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. ఎక్కడికక్కడ గుర్రపు డెక్క పేరుకుపోయింది. పంటలకు సక్రమంగా సాగు నీరు అందని పరిస్థితి ఉంది. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండడం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వం స్పందించి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి.

– ఆళ్ల వీరబాబు, రైతు, కిర్లంపూడి, కాకినాడ జిల్లా

అచ్యుతాపురం సెజ్ ప్రమాదంపై అఫిడవిట్లు

- దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్‌జిటి నోటీసులు

3



పూడి దుర్గాప్రసాద్ కుటుంబీకులను పరామర్శిస్తున్న సిహెచ్.నర్సింగరావు, తదితరులు

భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

2

నవంబరు 26 పోరాట దినం

- లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సెప్టెంబరు 23న 'బ్లాక్ డే'
- కార్మిక సంఘాలు, ఎస్‌కెఎం సంయుక్త పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కారుపై రైతు, కార్మిక సంఘాలు మరోసారి పోరుబాట పట్టాయి. హక్కులు, డిమాండ్ల సాధన కోసం రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజైన నవంబరు 26న దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర కార్మిక సంఘాలు (సిటియు), ఫెడరేషన్లు, అసోసియేషన్ల సంయుక్త వేదిక ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త సమావేశం అనంతరం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేసింది. బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా బ్యాంకు యూనియన్ల ఉమ్మడి వేదిక ఈ నెల 28న చేపట్టిన సమ్మెకు మద్దతిస్తున్నట్లు తెలిపాయి. లేబర్ కోడ్‌ల ఆమోదాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు సెప్టెంబరు 23న తలపెట్టిన 'బ్లాక్ డే' నిరసన కార్యక్రమంలో పాల్గొంటామని ఎస్‌కెఎం స్పష్టం చేసింది.

యువత అంచనాలు వమ్ము చేసిన మోడీ సర్కారు

సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు తగ్గిన కారణంగా ఎన్‌డిఎ ప్రభుత్వం బలహీనంగా ఉన్నప్పటికీ, కార్మిక, రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను కొనసాగిస్తోందని కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త సమావేశం పేర్కొంది. పంటలకు ఎంఎస్‌పితో సహా రైతులు, అలాగే కార్మికుల, ప్రజల డిమాండ్లను కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందని, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అది ప్రస్ఫుటం అయిందని స్పష్టం చేసింది. నిరుద్యోగ యువత అంచనాలను వమ్ము చేసిందని విమర్శించింది. వ్యవసాయరంగ సంక్షోభం, కార్మికుల సమస్యలు బడ్జెట్‌లో పట్టించుకోలేదని ఎస్‌కెఎం, సిటియు సంయుక్త వేదిక ఆగ్రహం వ్యక్తం చేసింది.

4 రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి ఓడించాలి

రానున్న కాలంలో పోరాటాలను ఉధృతం చేయాలని, ఐక్యతను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చింది. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్రంలోని మిత్రపక్షాలతో కలిసి అధికారంలో వున్న బిజెపిని ఢీకొనడంతోపాటు, వారిని అధికారానికి దూరంగా ఉంచేందుకు ఉమ్మడిగా ప్రచారం నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. కోవిడ్-19 మహమ్మారి కాలంలో 2020 సెప్టెంబరులో మూడు లేబర్ కోడ్‌లను ఆమోదించిన రోజు అయిన సెప్టెంబరు 23ను 'బ్లాక్ డే'గా పాటించే ట్రేడ్ యూనియన్ల ఆందోళనకు తమ మద్దతు, సంఘీభావం ఉంటుందని ఎస్‌కెఎం పేర్కొంది. ప్రజలు, దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్న తిరోగమన విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను పెంపొందించేందుకు అక్టోబరులో ఎస్‌కెఎం, సిటియు ఫ్రంట్‌ల నాయకత్వం విస్తృతంగా చర్చలు జరుపుతారని అంగీకరించినట్లు ప్రకటనలో తెలిపింది.

స్మార్ట్ మీటర్లను బలవంతంగా అమర్చడాన్ని ఖండించిన వేదిక

స్మార్ట్ మీటర్లను బలవంతంగా అమర్చడాన్ని సమావేశం ఖండిస్తూ దీనికి వ్యతిరేకంగా జరిగే ఆందోళనలకు సంపూర్ణ మద్దతు తెలిపింది. ప్రీమియం, బెనిఫిట్, మెడికల్ ఇన్సూరెన్స్‌తోపాటు వ్యవసాయంపై కూడా జిఎస్‌టిని తొలగించాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నవంబరు 26న దేశవ్యాప్తంగా జనసమీకరణ చేపట్టాలని సమావేశం తీర్మానించింది. రాష్ట్రాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొంది.

బ్యాంక్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళనకు మద్దతు

యూనియన్లపై దాడులు, ఈ వ్యూహాత్మక రంగం ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా మిగతా 2లో



వివక్షా పూరిత బిల్లు

- సవరణలతో వక్ఫ్ వ్యవస్థ బలహీనం
- సుప్రీంకోర్టు న్యాయవాది పొత్తూరి సురేష్ కుమార్

2

మరో రూ.3 వేల కోట్ల రుణానికి ఇండెంట్

- రెండున్నర నెలల్లో ఆరుసార్లు రూ.17 వేల కోట్ల అప్పు
- ఆర్‌బిఐ వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లు

3

ఫార్మా ప్రమాదాలపై సమగ్ర విచారణ

- నివారణకు నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీ
- కార్మిక సంఘాలకు స్థానం ఉండాలి
- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫార్మా కంపెనీల్లో వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపాలని, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం లేఖ రాశారు. అచ్యుతాపురం ఎస్‌ఇజెడ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదం రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్దదని తెలిపారు. 17 మంది మరణించడం, 36 మంది క్షతగాత్రులుగా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన కంపెనీని పరిశీలించి బాధితులను తమరు పరామర్శించారని గుర్తుచేశారు. ఈ ప్రమాదం జరిగిన 24 గంటల్లోపే పరవాడ ఫార్మాసిటీలోని సినర్జిన్ ఫార్మా కంపెనీలో మరో ప్రమాదం జరిగిందని తెలిపారు. కాలుష్య నివారణ శాఖ, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు, ఫైర్ డిపార్టుమెంట్ల స్పందన కరువైందని పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి మండలాల్లో ఫార్మా పరిశ్రమలు, స్పెషల్ ఎకనామిక్ జోన్ల (ఎస్‌ఇజెడ్)లో ఇతర పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. ప్రమాదకరమైన 138 ఫార్మా పరిశ్రమల్లో 40 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని వివరించారు. ఎస్‌ఇజెడ్‌లలో మరో 20 వేల మంది కార్మికులు ఉన్నారని తెలిపారు. పరిశ్రమల్లో ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్లు సేఫ్టీ ఆడిట్ రెగ్యులర్‌గా నిర్వహించక పోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్మికులు, ఉద్యోగులు పదుల సంఖ్యలో మరణిస్తున్నారని వెల్లడించారు. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ ప్రాథమిక విచారణలో ఎసెన్షియా కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని నిర్ధారణ చేశారని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో 119కు పైగా ప్రమాదాలు జరిగి, సుమారు 150 మంది మరణించారని, మిగతా 2లో

లెబనాన్‌పై వందకు పైగా ఇజ్రాయిలీ యుద్ధ విమానాల దాడి

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు ఆజ్యం
- హిజ్బుల్లా రాకెట్లతో ప్రతీకార దాడి



బీరూట్: అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మద్దతుతో ఇష్టానుసారంగా చెలరేగుతున్న ఇజ్రాయిల్‌లోని యూదు దురహంకార ప్రభుత్వం తాజాగా లెబనాన్‌పై పెద్దయెత్తున వైమానిక దాడులకు దిగింది. ఆదివారం తెల్లవారుజామున వందకుపైగా అమెరికా తయారీ యుద్ధ విమానాలతో లెబనాన్‌పై విరుచుకుపడింది. ఈ దాడిలో డజన్ల కొద్దీ జనం చనిపోయారు. పెద్దయెత్తున పంటలకు, ఆస్తులకు నష్టం వాటిల్లింది. ముఖ్యంగా విద్యుత్, నీటి సరఫరా వ్యవస్థలు వంటి పౌర మౌలిక సదుపాయాలు ధ్వంసమైనట్లు లెబనాన్ జాతీయ వార్తా సంస్థ తెలిపింది. ఇజ్రాయిల్ దుందుడుకు చర్య పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసింది. ఇజ్రాయిల్ దాడులకు ప్రతీకారంగా హిజ్బుల్లాలు ఇజ్రాయిల్ మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని రాకెట్లతో దాడి చేశారు. దక్షిణ లెబనాన్ పట్టణం అల్‌తిరిపై జరిగిన దాడిలో ఇద్దరు, డ్రోన్ల దాడిలో మరొకరు చనిపోయారని, అనేక మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ అత్యవసర ఆపరేషన్ల కేంద్రం తెలిపింది. హిజ్బుల్లా కమాండర్ ఫాద్ షాక్రిని హత్య చేసిన ఇజ్రాయిల్‌పై ప్రతీకార దాడులు పెద్దయెత్తున ఉంటాయని లెబనీస్ ఇస్లామిక్ ప్రతిఘనా సంస్థ తెలిపింది. బీరూట్ దక్షిణ శివార్లలో యూదుల క్రూరమైన దాడికి ప్రతీకారంగా తమ బలగాలు ఇజ్రాయిల్‌పై దాడులు ప్రారంభించాయని హిజ్బుల్లాలు తెలిపారు. ఇజ్రాయిలీ మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులను మున్ముందు చేపడతామని ఆ సంస్థ తెలిపింది. మరో వైపు తాజా పరిస్థితిపై చర్చించేందుకు లెబనాన్ ప్రధాని నజీబ్ మికాతి అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు.

రైల్వే ఉద్యోగులపై పని భారం

- తీవ్రస్థాయిలో సిబ్బంది కొరత
- వేతనాలు అంతంత మాత్రమే
- ఆర్‌డిఎస్‌ఒ నివేదిక వెల్లడి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని రైల్వేలో పెద్ద సంఖ్యలో ఖాళీలు, ప్రాథమిక సౌకర్యాలు లేమి వంటి సవాళ్లను ఎదుర్కొంటోందని రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డిఎస్‌ఒ) తెలిపింది. రైల్వే మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన పనిచేసే ఆర్‌డిఎస్‌ఒ నిర్వహించిన అధ్యయనం ప్రకారం రైలు కంట్రోలర్లు పనిలో తక్కువ వేతన స్కేలు, ఖాళీలు, ప్రాథమిక సౌకర్యాల లేమి కారణంగా తీవ్రమైన ఒత్తిడి, సిబ్బంది కొరత వంటి అనేక సవాళ్లను ఎదుర్కుంటున్నట్లు పేర్కొంది. ఉద్యోగులపై పని భారం పెరుగుతోందని తెలిపింది. రైల్వే బోర్డుకు సమర్పించిన నివేదికలో సెక్షన్ కంట్రోలర్లు అధిక ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు చేస్తారని, దాదాపు 20 శాతం వరకు ఖాళీలు ఉండటం వల్ల వారి పని మరింత కష్టతరంగా మారిందని తెలిపింది. డిపార్ట్‌మెంట్‌లో పోస్టింగ్ చేసిన అధికారులు డబ్బు, గౌరవం, కెరీర్ వృద్ధి పరంగా తగిన ప్రతిఫలం లేకపోవడం వంటివి ఎదుర్కొంటున్నారు. 'సెక్షన్ కంట్రోలర్లు తమ విధులను సమర్ధవంతంగా నిర్వర్తించడంలో ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే శీర్షికతో ఈ నివేదిక రైలు కార్యకలాపాల సామర్థ్యం, ప్రభావాన్ని పెంపొందించడానికి ఎంపిక విధానం, శిక్షణ, మౌలిక సదుపాయాలలో మెరుగుదలను అన్వేషించడం లక్ష్యంగా పెట్టుకుంది.

దాదాపు 1,05,555 కిలోమీటర్ల ట్రాక్‌లలో ప్రతిరోజూ వేలాది రైళ్లు వివిధ విభాగాల్లో ప్రయాణిస్తున్న ఇండియన్ రైల్వే ప్రపంచంలోని అతిపెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటి అని నివేదిక పేర్కొంది. ఐఆర్ నెట్‌వర్క్‌లో 68 ఆపరేషన్ కేంద్రాలతో నియంత్రించబడుతుందని తెలిపింది. డివిజనల్ హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న డివిజనల్ కంట్రోల్ ఆఫీస్, రైల్వే నెట్‌వర్క్ మొత్తం ఆపరేషన్‌లో కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొంది.

డివిజన్‌లోని రైలు నెట్‌వర్క్ అనేక స్టేషన్‌లతో కూడిన విభాగాలుగా విభజించబడిందని, ఈ సెక్షన్ల మీదుగా నడుస్తున్న రైళ్లను కంట్రోల్ బోర్డులోని షిఫ్ట్ డ్యూటీలలో 24 గంటలూ పనిచేసే సెక్షన్ కంట్రోలర్లు నియంత్రిస్తారని, పర్యవేక్షిస్తారని నివేదిక పేర్కొంది. వివిధ డివిజనల్ కంట్రోల్ కార్యాలయాల నుండి డేటాను సేకరించి 15 శాతం నుండి 24 శాతం వరకు ఖాళీలున్నట్లు గుర్తించింది.

'కేడర్‌లో అధిక ఖాళీలు సిబ్బంది పని పరిస్థితిని ప్రభావితం చేస్తాయి. ఈ కఠినమైన పరిస్థితుల్లో పని నాణ్యత కూడా దెబ్బతింటుంది. సిబ్బంది మిగిలిన సెలవులను నిర్వహించడంలో కూడా ఇబ్బందులను ఎదుర్కొంటుంది. కాబట్టి, కేడర్‌లో ఖాళీ ప్రాధాన్యతపై విశ్లేషించి, ఖాళీని భర్తీ చేయడానికి కృషి చేయాలి' అని నివేదిక పేర్కొంది. సెక్షన్ కంట్రోలర్లు 24ఇ7 పని చేస్తాయని, వారి షిఫ్టులను ఉద్యోగులు లేకుండా నిర్వహించలేమని పేర్కొంది.'రోస్టర్ ప్రకారం, సెక్షన్ కంట్రోలర్‌కు వారానికోసారి 30 గంటల విశ్రాంతి అవసరం. కానీ తగిన సంఖ్యలో సిబ్బంది లేకపోవడంతో, కొన్నిసార్లు సెక్షన్ మిగతా 2లో

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకు దుర్మరణం

ప్రజాశక్తి-రేగిడి (శ్రీకాకుళం జిల్లా)

ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో తండ్రీ కొడుకు దుర్మరణం చెందిన ఘటన శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బంటుపల్లి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. విజయనగరం జిల్లా రేగిడి మండలం ఉప్పర నాయుడు వలస గ్రామానికి కరణం రామకృష్ణ (52), ఆయన కుమారుడు సాయికిరణ్ (21)తో కలిసి భోగాపురంలో కోచింగ్ సెంటర్‌లో ఉన్న తన కుమార్తె సాత్వికను చూసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు.

కుమార్తెను కలుసుకొని తిరిగి స్వగ్రామం వస్తుండగా, లారీ ఢీకొని తండ్రి, కొడుకులు అక్కడకక్కడే మృతి చెందారు. స్థానికులు ప్రమాద స్థలం వద్దకు చేరుకొని రామకృష్ణ జేబులో ఉన్న డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా అడ్రస్సు కనుక్కొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తరలించారు. భర్త, కుమారుడు మృతికి రత్నకుమారి కన్నీరుమున్నీరయ్యారు. రణస్థలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సామరస్య సమాజ నిర్మాణానికి పునాది శ్రీకృష్ణాష్టమి

- గవర్నరు అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామరస్య సమాజ నిర్మాణానికి పునాదిని ధ్రువీకరించే పండగే శ్రీకృష్ణాష్టమి అని గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పండగ శాంతి, ప్రగతి, శ్రేయస్సుకు నాంది కావాలని, రాష్ట్ర ప్రజల మధ్య సోదర, సౌభ్రాతృత్వం, సామరస్య బంధాలను మరింత బలోపేతం చేయాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

8 మంది ట్రైనీ ఐఎఎస్‌లకు పోస్టింగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శిక్షణ పూర్తి చేసుకున్న 2022 బ్యాచ్‌కు చెందిన ఎనిమిది ట్రైనీ ఐఎఎస్‌లకు సబ్ కలెక్టర్లుగా ప్రభుత్వం పోస్టింగులు ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం జిఓ ఆర్‌టి నెంబరు 1468, జిఓ ఆర్‌టి నెంబరు 1469ను విడుదల చేసింది. వీరిలో మార్కాపురానికి సహదిత్ వెంకట్, పాలకొండకు యశ్వంత్‌కుమార్, నర్సీపట్నంకు కల్పశ్రీ, పెనుకొండకు భరద్వాజ్, గూడూరుకు రాఘవేంద్ర మీనా, పాడేరుకు శౌర్యమాన్ పటేల్, కందుకూరుకు శ్రీపూజ, తెనాలికి సంజనా సింహ ఉన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

నవంబరు 26 పోరాట దినం

(మొదటి పేజీ తరువాయి)

యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ఆగస్టు 28న సమ్మె పిలుపునకు సిటియు, ఎస్‌కెఎం సంయుక్త వేదిక మద్దతు ఇచ్చింది. మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు, క్రూరమైన అత్యాచారాలు, హత్యలపై సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రూరమైన చర్యలను ఖండిస్తూనే బాధితులకు న్యాయం చేయాలంటూ ఆందోళనకారుల డిమాండ్లకు తమ పూర్తి మద్దతును తెలియజేసింది. నిర్భయంగా జీవించడం కోసం సమాజాన్ని సురక్షితంగా మార్చడానికి నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని సమావేశం నొక్కి చెప్పింది. ఢిల్లీలోని ప్రతిష్టాత్మకమైన జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు)లో కాషాయీకరణ విధానాలు, కక్షసాధింపు చర్యలను నిరసిస్తూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు మద్దతిస్తున్నట్లు ఎస్‌కెఎం, సిటియు ప్రకటించాయి.

భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - అచ్యుతాపురం, రాంబిల్లి (అనకాపల్లి)

పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తోన్న కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఓ కళాశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంపెనీల యాజమాన్యాలకు అనుకూలంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని తెలిపారు. భద్రతా ప్రమాణాలు పాటించకున్నా పట్టించుకోవడం లేదన్నారు. మరోవైపు కార్మికుల బాగోగుల విషయంలో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని తెలిపారు. ఆ కంపెనీలో రియాక్టర్ పైపులైన్, నిర్మాణ డిజైన్‌లోనే ప్రధాన లోపమని రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ డిజి ప్రకటించారంటే ప్రభుత్వాలు కంపెనీల యాజమాన్యాల పట్ల ఎంత ఉదాసీనంగా ఉంటున్నాయో అర్థమవుతోందన్నారు. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ కొరవడుతోందని పేర్కొన్నారు. ఎసెన్షియా ప్రమాద ఘటనను పరిశీలించడానికి వచ్చిన కేంద్ర ఉక్కు సహాయ మంత్రి మాట్లాడుతూ అన్నీ బాగా ఉన్నాయని, ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగిందని చెప్పడం యజమానులకు కొమ్ము కాయడం కాదా ? అని ప్రశ్నించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పాల్గొన్నారు.



పూడి దుర్గాప్రసాద్ కుటుంబీకులను పరామర్శిస్తున్న సిహెచ్.నర్సింగరావు, తదితరులు

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఎసెన్షియా ఫార్మా ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను సిహెచ్.నర్సింగరావు పరామర్శించారు. తొలుత ఎస్ఇజెడ్ కాలనీ మోటూరుపాలెం గ్రామానికి చెందిన పూడి దుర్గాప్రసాద్, వాసెట్టిపాలెం గ్రామానికి చెందిన ఎల్లబెల్లి చిన్నారావు, రాంబిల్లి మండలం మూలజంప గ్రామానికి చెందిన వేగి సన్యాసినాయుడు కుటుంబీకులను ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబాలు మనోధైర్యంతో జీవనం సాగించాలని సూచించారు. ప్రమాదంలో కుటుంబ సభ్యులు మృతి చెందడం తీరని లోటు అని పేర్కొన్నారు.

గత పాలనలో అక్రమాలు గుర్తించేందుకే!

- రెవెన్యూ గ్రామ సభల్లో ఫోకస్ అదే
- యాక్షన్ టేకెన్ రిపోర్టులతో సిద్ధమవుతున్న యంత్రాంగం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి పాలనలో 2014-19 ప్రభుత్వం పంపిణీ చేసిన భూములు, అసైన్డ్ ఇంటి పట్టాలు, భూ పందేరాల్లో అక్రమాలను వెలికితీయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ సదస్సుల ప్రధాన ధ్యేయం అదేలా అనిపిస్తోంది. సెప్టెంబరు మొదటి వారంలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల్లో భూ అక్రమాలు పెద్దయెత్తున వెలుగులోకి వచ్చే అవకాశాలున్నట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. భూ మార్పిడులకు సంబంధించి యాక్షన్ టేకెన్ రిపోర్టులు తయారు చేయాలని సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. వైసిపి పాలనలో భూ ఆక్రమణలు, రికార్డుల ట్యాంపరింగ్, వెబ్‌ల్యాండ్‌లో భూ యజమానుల పేర్లు మారినట్లు టిడిపి కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. వీటితో పాటు 22(ఎ) నిషేధిత భూములు, ఇనాం భూములు, మాన్యాలు, అసైన్‌మెంట్ భూముల క్రమబద్ధీకరణలో అనర్హులకు పెద్దపీట వేసినట్లు మదనపల్లి ఘటనతో తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలో గ్రామ సభలు పెట్టడం ద్వారా మాత్రమే అక్రమార్కులకు చెక్ పెట్టవచ్చని ప్రభుత్వం భావించింది. గ్రామ సభలకు సంబంధించి 9 కాలమ్స్‌తో ఫ్రీ హోల్డ్ చేసిన భూములకు సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు వీలుగా ప్రొఫార్మాను భర్తీ చేయాలంటూ రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి అధికారులకు పంపారు. ఇందులో భూమి ఏ మండలం, ఏ గ్రామం, నిజమైన అసైనీ లబ్ధిదారులు ఎవరు? ఎల్‌పిఎమ్/సర్వే నెంబరు ఎంత? భూమి విస్తీర్ణం ఎంత? వెబ్‌ల్యాండ్‌లో నమోదైందా? ఎఫ్‌సిఒ, ఎస్ఎఫ్ఎ/ఎమ్‌డిఆర్ నమోదు చేయాల్సి ఉంటుంది. రెండో దశలో విచారణలో అసైనీ నిజమైన వారా? లేక ఇతరుల చేతిలో భూమి ఉందా? ఆయా భూములు రిజిస్టర్ అయ్యాయా? అయితే డాక్యుమెంట్ వివరాలు, అనర్హులుగా గుర్తిస్తే అందుకు గల కారణాలు ఏమిటీ? రిమార్కు రెవెన్యూ సిబ్బంది కచ్చితంగా నమోదు చేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ఈ మొత్తాన్ని డివిజన్ లెవల్ కమిటీ క్షుణ్ణంగా మానిటరింగ్ చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

వీటితోపాటు లే అవుట్ల వారీ సమాచారాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా 2019-2024 మధ్య పేదల పేరుతో మంజూరు చేసిన ఇంటి పట్టాలను సైతం మరో ప్రొఫార్మాలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో డి-పట్టా భూములు (నిబంధనలు ఉల్లంఘించి మంజూరు), డి-పట్టాను ఇతరులు కొనుగోలు చేసి ఉంటే వారి వివరాలు, డి-పట్టా భూములకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందారా? ప్రైవేట్ భూములకు సంబందించి వాస్తవ విలువ? ఆయా లే అవుట్లలో ప్లాట్లు వేసి ఉంటే వాటి వివరాలు? ఖాళీగా ఉంటే వాటికి సంబంధించిన ప్లాట్స్ వివరాలు? వాస్తవంగా పంపిణీకి సిద్ధంగా ఉన్న ప్లాట్స్ వివరాలను కూడా రెవెన్యూ సిబ్బంది ప్రొఫార్మాలో నమోదు చేయాలని ప్రభుత్వం జిల్లా స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. గ్రామ సభల నేపథ్యంలో సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఈ నెల 16న విజయనగరం జిల్లాలోని కలెక్టర్, సబ్ రిజిస్ట్రార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్సు అసిస్టెంట్ డైరెక్టర్‌తో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఇదే తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన తప్పనిసరి

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంతరిక్ష పరిశోధన ఫలాలను సక్రమంగా వినియోగించుకుంటే దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందించడం అవసరమన్నారు. శాస్త్రవేత్తలుగా మారేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని డిప్యూటీ సిఎం కార్యాలయంలో రష్యాకు చెందిన వ్యోమగామి సెర్గికోర్సకొవ్, స్పేస్ కిడ్జ్ ఇండియా సంస్థ ప్రతినిధులు పవన్‌కల్యాణ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యోమగాములు తయారు చేసిన అతి చిన్న శాటిలైట్ డిప్లయర్ గురించి వివరించారు. అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు ఆసక్తి పెంచాలంటే రాష్ట్రంలో స్పేస్ పార్కు ఏర్పాటు చేయాలని స్పేస్ కిడ్జి ఇండియా వ్యవస్థాపకులు, సిఇఒ కేశన్ కోరారు. దీని ద్వారా విద్యార్థులకు అంతరిక్ష రంగంపై మరింత అవగాహన పెంచవచ్చన్నారు. అనంతరం రష్యా వ్యోమగామిని పవన్‌కల్యాణ్ సత్కరించారు. ఈ భేటీలో స్పేస్ కిడ్జి ఇండియా ప్రతినిధులు యజ్ఞసాయి, ఎస్‌బి అర్జునర్, సాయితన్య పాల్గొన్నారు.



కళల జాతర

శ్రావణ మాసం సందర్భంగా విజయవాడలోని దుర్గా అగ్రహారంలో ఆదివారం నిర్వహించిన గంగమ్మ జాతరలో విశేషంగా ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

ఫొటో : టివి రమణ

ఉక్కు ప్రయివేటీకరణతో కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర నష్టం

- హెచ్‌ఎంఎస్ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సంఘం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణతో కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర నష్టం జరగనుందని హెచ్‌ఎంఎస్ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు గణపతిరెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1291వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌ఎంఎస్ సంఘం కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. తక్షణమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, వర్కింగ్ క్యాపిటల్‌ను సమకూర్చాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కాంట్రాక్టు కార్మికులు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

పనితీరే గీటురాయి

- పార్టీలో యువతకు ప్రాధాన్యత
- త్వరలో రాష్ట్ర కమిటీ నియామకం
- టిటిడిపి నేతలతో చంద్రబాబు సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణలోని ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు

క్రమశిక్షణ, చిత్తశుద్ధితో పనిచేసే నాయకులకే పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అన్నారు. పనితీరు ఆధారంగానే పదవులు ఉంటాయనీ, సీనియార్టీ ఒక్కటే కొలమానం కాదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో టిటిడిపి నాయకులతో చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో అన్ని స్థాయిల్లో యువతకు తగిన ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. జిల్లా కమిటీల నియామకం తర్వాత రాష్ట్ర కమిటీని ప్రకటించనున్నట్లు చెప్పారు. పార్టీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సభ్యత్వ నమోదుపైనే నాయకుడికి ప్రజల్లో ఎంత ఆదరణ ఉందో స్పష్టమవుతుందన్నారు. పార్టీ వ్యవహారాల పర్యవేక్షణకు అడహక్ కమిటీ నియామిస్తామనీ, ఆ సభ్యులే ఒక్కో జిల్లాను పర్యవేక్షిస్తారని తెలిపారు. సోషల్ మీడియా కమిటీని సైతం బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీపై త్వరలోనే స్పష్టత ఇస్తానన్నారు. పార్టీకి పునర్ వైభవమే లక్ష్యమని, అందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 15 అసెంబ్లీ స్థానాల్లో విజయం, మరో 17 స్థానాల్లో రెండో స్థానంలో నిలిచామని చంద్రబాబు గుర్తు చేశారు. ఇప్పటికీ గ్రామ స్థాయిలో కేడర్ ఉందని తెలిపారు. నేతలు పార్టీ మారడంతో కొంత స్తబ్దత ఉందని, దానిని తొలగించేందుకు ఇతర పార్టీల నుంచి ఎవరొచ్చినా స్వాగతించాలని నాయకులకు సూచించారు. తెలుగుదేశం పార్టీని వీడి వెళ్లిన వారు తిరిగి పార్టీలోకి రావాలని చంద్రబాబు ఆహ్వానించారు. పదిపదిహేను రోజులకొకసారి హైదరాబాద్‌కు వస్తానని, పార్టీ పరిస్థితిని సమీక్షిస్తానని వెల్లడించారు. సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్, బక్కని నర్సింహులు, మాజీ ఎమ్మెల్యే ప్రసూన, నాయకులు అశోక్, అనూప్, లత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు. సమావేశానంతరం చంద్రబాబును మాజీ మంత్రి బాబూమోహన్ కలిశారు.

రైల్వే ఉద్యోగులపై పని భారం

(మొదటి పేజీ తరువాయి)

కంట్రోలర్‌లకు సెలవులు ఇవ్వడంలో సమస్యలను అడ్మినిస్ట్రేషన్ ఎదుర్కొంటుంది. నిరంతర పని షెడ్యూల్‌లో వారు పనిభారాన్ని మోస్తున్నట్లు భావిస్తారు. దీనివల్ల వారి శక్తిపైన ప్రభావితం అవుతుంది' అని నివేదిక తెలిపింది. ఫీడర్ కేటగిరీ అభ్యర్థులకు మరింత ఆకర్షణీయంగా ఉండేలా ప్రాథమిక వేతన స్కేల్‌ను గ్రేడ్ పే 4,200 నుండి గ్రేడ్ పే 4,600కు అప్‌గ్రేడేషన్ చేయాలని, రిక్రూట్‌మెంట్/సెలక్షన్‌లో ఆప్టిట్యూడ్ టెస్ట్ ప్రవేశపెట్టడం, శిక్షణ వ్యవధిని పొడిగించడం వంటి అనేక చర్యలను అధ్యయనం సూచించింది. 2020లో నిలిపివేయబడిన రైల్వే రిక్రూట్‌మెంటు బోర్డుతో సెక్షన్ కంట్రోలర్ల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌ను తిరిగి ప్రవేశపెట్టాలని సూచించింది. పీరియాడికల్ రిఫ్రెషర్ కోర్సులు తీసుకోకుండా ఏ కంట్రోలర్‌నూ పని చేయడానికి అనుమతించకూడదని అధ్యయనం తెలిపింది.

ఫార్మా ప్రమాదాలపై సమగ్ర విచారణ

(మొదటి పేజీ తరువాయి)

వందలాది మంది క్షతగాత్రులైనట్లు తమరే స్వయంగా ప్రకటించారని లేఖలో తెలిపారు. ప్రమాదాల బారిన పడ్డవారు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. బ్రాండిక్స్ వంటి పరిశ్రమల్లో విష వాయువులు లీకైన ఘటనలో 500 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారని వివరించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ జోక్యం చేసుకుని ఒక్కొక్క కుటుంబానికి రూ.లక్ష పరిహారం ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు. యాజమాన్యం అప్పీలుకు వెళ్లి కార్మికులకు నష్టపరిహారం ఇవ్వకుండా ఎగ్గొట్టిందని పేర్కొన్నారు. గత 80 రోజుల్లో అనకాపల్లి జిల్లాలోనే 4 ప్రమాదాలు జరిగి భారీగా ప్రాణనష్టం జరిగిందని వివరించారు. రాష్ట్రంలోనే అనేక ప్రైవేట్ పరిశ్రమల్లో ఇదే పరిస్థితి నెలకొందని, కార్మికుల ప్రాణాలకు కనీసం విలువ లేకుండా పోయిందని తెలిపారు. 2019 మార్చి 28న ఇచ్చిన జిఓ 62 వల్ల ఎస్ఇజెడ్‌లు తనిఖీలు లేకుండా పూర్తిగా మినహాయించబడ్డాయని, ఈ జిఓను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. స్వయంగా భద్రత పాటిస్తున్నట్లు యాజమానులు హామీ ఇస్తే తనిఖీలు అక్కర్లేదనే క్లాజు కూడా పూర్తిగా ఎత్తివేయాలని కోరారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో తనిఖీలు లేకపోవడమే ఈ ప్రమాదాలకు మూలకారణమని తెలిపారు. కావున సేఫ్టీ ఆడిట్ రెగ్యులర్‌గా నిర్వహించాలని డిమాండ్ చేశారు. 60 వేల మంది కార్మికులు పనిచేస్తున్న అచ్యుతాపురం, పరవాడ ప్రాంతంలో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి లేదన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో క్షతగాత్రులను విశాఖపట్నం, అనకాపల్లిలోని ఆస్పత్రులకు తరలించేలోపే మరణిస్తున్నారని వివరించారు. కార్మికులు, యాజమాన్యాల నుంచి కోట్లాది రూపాయల నిధులు జమవుతున్నా ఇఎస్ఐ ఆస్పత్రి ఈ ప్రాంతంలో లేదని పేర్కొన్నారు.

అచ్యుతాపురం కేంద్రంగా 100 పడకల సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి, బర్న్‌వార్డుతో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అత్యవసర పరిస్థితులకు ఎన్‌డిఆర్ఎఫ్ కేంద్రాన్ని, అగ్నిమాపక వాహనాలను అదనంగా ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో జరిగిన ప్రమాదాలపై వివిధ కమిటీలు ఇచ్చిన నివేదికలను బయటపెట్టాలని, వీటిల్లోని లోపాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదాల నివారణకు ఈ చర్యలు తీసుకోవాలి

- .పారిశ్రామిక ప్రమాదాల నివారణకు నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీ వేయాలి. ఈ కమిటీలో కార్మిక సంఘాల నాయకులకు కూడా స్థానం కల్పించి సమగ్ర నివేదిక ఇవ్వాలి.
- రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు నిర్ణీత సమయాల్లో పరిశ్రమలను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలి.
- పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలకు యాజమాన్యాలు బాధ్యులుగా చేసి క్రిమినల్ కేసులు పెట్టాలి.
- అచ్యుతాపురం తదితర సెజ్‌లలో వంద పడకల ఆస్పత్రులను ఇఎస్ఐ ద్వారా నిర్మింపజేసి నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలి.
- రాష్ట్రంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వలస కార్మికులందర్నీ రిజిస్టర్ చేసి వారి వివరాలన్నీ ఎంఆర్‌ఓలు సంక్షిప్తం చేయాలి.
- కార్మిక శాఖ అధికారులు పనిగంటల అమలుపై అన్ని పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించాలి.
- ప్రమాదకరమైన పరిస్థితులున్న అన్ని పరిశ్రమల్లో పర్మినెంట్ కార్మికులను మాత్రమే నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- ఎసెన్షియా కంపెనీ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం వేసే కమిటీలో కార్మిక ప్రతినిధిని కూడా చేర్చాలి. అప్పుడే వాస్తవాలు వెలికివస్తాయి.
- ప్రతి ఆరు నెలలకోసారి ఫార్మా కంపెనీల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి.
- హెల్మెట్, షూస్, ఫైర్‌కోట్స్, ఫేస్‌షీల్డ్, హార్డ్‌టోపీలు, గ్లౌజులు, ఇయర్ ప్లగ్‌లు, రెస్పిరేటర్లు, ఫాల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ తదితర భద్రతా పరికరాలు ఇవ్వాలి.

వివక్షా పూరిత బిల్లు

- సవరణలతో వక్ఫ్ వ్యవస్థ బలహీనం
- సుప్రీంకోర్టు న్యాయవాది పొత్తూరి సురేష్ కుమార్



వక్ఫ్ చట్టానికి కేంద్రం నూతనంగా తీసుకొచ్చిన సవరణలను ఎవరూ కోరలేదు. కమిటీ లేదు, కనీసం అధ్యయనాలుగానీ, నివేదికలుగానీ లేవు. బిజెపి కార్యకర్తలు, ఆ పార్టీ న్యాయవాదులు వేసిన పిటీషన్లలో అడిగిన విధంగా ముస్లిములపై వివక్షాపూరితంగా, ఉద్దేశపూర్వకంగా సవరణలు తీసుకొచ్చారని కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన వక్ఫ్ చట్టం సవరణ బిల్లుపై సుప్రీంకోర్టు న్యాయవాది పొత్తూరి సురేష్ కుమార్ ప్రజాశక్తి ప్రతినిధి వల్లభనేని సురేష్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.

ఇంటర్వ్యూ

ప్రశ్న : కేంద్రం వక్ఫ్ చట్టానికి సవరణలు ఎందుకు తెచ్చింది ? అవసరం ? అధ్యయనం ఏమైనా ఉన్నాయా ?

పొత్తూరి : ప్రస్తుతం సవరణలు తీసుకురావాల్సిన అవసరం లేదు. కమిటీ నివేదికలు గానీ, అధ్యయనాలు గానీ ఏమీ లేవు. గతంలో సచార్ కమిటీ, జాయింట్ పార్లమెంటరీ కమిటీ రిపోర్టులూ ఉన్నాయి. వాటిని అనుసరించి 2013లో మార్పులు తీసుకొచ్చారు. బిజెపి కార్యకర్తలు, లాయర్లు బిజెపి అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్ల కాలంలో దేశంలో ఉన్న అనేక హైకోర్టుల్లో అలాగే సుప్రీంకోర్టులోనూ 1995 వక్ఫ్ చట్టం, దాని నిబంధనలపై కేసులు వేశారు. ఆ కేసుల సారాంశం ఏమిటంటే వక్ఫ్ చట్టం 1995, దాని బలోపేతం కోసం 2013లో తెచ్చిన సవరణలు రద్దు చేయాలని, అవి వక్ఫ్ వ్యవస్థకు అధికారాలు ఎక్కువ ఇచ్చిందని వారి వాదన. సెక్షన్ 40 ప్రకారం ఏదైనా భూమి వక్ఫ్ భూమి అని అనుమానం ఉంటే దాన్ని విచారణ జరిపి డిక్లేర్ చేసే అధికారం వక్ఫ్ ట్రిబ్యునల్‌కు ఉంది. దాన్ని ఛాలెంజ్ చేశారు.

ప్రశ్న : వక్ఫ్ అంటే ఏమిటి ?

పొత్తూరి : ఎవరైనా వ్యక్తి స్థిర, చరాస్తిని మతపరమైన, పవిత్రమైన కార్యకలాపాలు, దాన ధర్మాల కోసం ముస్లిం మత ప్రకారం జరిగే కార్యక్రమాల కోసం అంకితం చేస్తే దాన్ని వక్ఫ్ అంటారు. అది ముస్లిమేతరులు కూడా చేయొచ్చు. వందల వేల సంవత్సరాల నుండి ఇది ఉంది. అయితే దీన్ని ఎక్కువగా ముస్లిములు చేస్తారు. కొన్నిసార్లు రాజులు, మహరాజులు కూడా చేశారు. కొత్త సవరణ ప్రకారం కేవలం ముస్లిములు మాత్రమే వక్ఫ్ చేయాలి. కనీసం ఆ మతంలో చేరి ఐదేళ్ల ఆరాధించిన వారు మాత్రమే వక్ఫ్ చేయడానికి వీలవుతుందనే నిబంధన పొందుపరిచారు.

ప్రశ్న : సవరణలు 2013 వక్ఫ్ చట్టానికి అనుకూలంగా ఉన్నాయా ? ప్రతికూలంగా ఉన్నాయా ?

పొత్తూరి : సవరణలు వక్ఫ్ చట్టానికి, దాని లక్ష్యానికి పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయి. వివక్షా పూరితంగా వాటిని రూపొందించారు. దీనివల్ల ముస్లిం ఆస్తులకు రక్షణ లేకపోగా, కొత్త సమస్యలను సృష్టించారు. ఉదాహరణకు వక్ఫ్ చట్టంలో 108ఏ అనేదానికి మిగతా చట్టాలతో పోలిస్తే అధికారం ఎక్కువగా ఉంది. దీన్ని బిజెపి కార్యకర్తలు, ఆ పార్టీ న్యాయవాదులు ఛాలెంజ్ చేశారు. సెక్షన్ 4 నుండి తొమ్మిది వరకు, అలాగే 52, 55, 107, 108, 108ఏను ఛాలెంజ్ చేశారు. ఏవైతే బిజెపి లాయర్లు, కార్యకర్తలు కోర్టుల్లో ప్రశ్నించారో వాటిని కేంద్రం తొలగించింది. వారు అడిగినవన్నీ కేంద్రం చేసింది.

ప్రశ్న : ప్రధానంగా వక్ఫ్ చట్టాన్ని బలహీనపరిచే అంశాలేమున్నాయి ?

పొత్తూరి : గతంలో వక్ఫ్ అనేదానికి విశాల నిర్వచనం ఉండేది. దాన్ని తగ్గించారు. గతంలో ఇది లిఖితపూర్వక డాక్యుమెంట్‌తో కాకుండా, నోటి ద్వారా ఆచరణలో వక్ఫ్ అమలు చేయడం అంటే వక్ఫ్ బై యూజర్ అంటారు. ఇటువంటి పద్ధతులను తొలగించారు. సెక్షన్ 104 ప్రకారం ఎవరైనా ముస్లిమేతరులు దర్గాలకు ఆస్తులు దానం చేస్తే దాన్ని కూడా వక్ఫ్ చట్టం ప్రకారమే నిర్వహిస్తారు. ఇప్పుడు 104 సెక్షన్‌ను తొలగించారు. ఇతర మతస్తులు ఇచ్చిన భూమి వక్ఫ్ కిందకు రాకుండా చేశారు. సెక్షన్ 3(6)లో, సెక్షన్ 9, 14లో సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, బోర్డులు ఉంటాయి. వాటిల్లో కౌన్సిల్లో 20 మంది, బోర్డులో 12 మంది సభ్యులు ఉంటారు. కౌన్సిల్, బోర్డు రెండు కూడా చట్టాల ప్రకారం పేద ముస్లిములకు ఎలాంటి సేవలు అందించాలనే అంశంపై పనిచేస్తాయి. అలాంటి వాటిల్లో ఇద్దరు ముస్లిమేతరులు ఉండాలనే నిబంధన తీసుకొచ్చారు. కానీ వక్ఫ్ చేయడానికి ముస్లిమేతరులకు ఉన్న హక్కులను రద్దు చేసి, 104ను తొలగించి, ఆస్తులు ఎలా పరిపాలించాలనే అంశంలో ఇతరులను తీసుకురావడంపైనే అభ్యంతరాలు వస్తున్నాయి.

ప్రశ్న : వక్ఫ్ ఆస్తుల విషయంలో నిరంతరం వివాదాలు కొనసాగేలా ఏమైనా సవరణలు ప్రతిపాదించారా ?

పొత్తూరి : అవును, సెక్షన్ 6, 7 ప్రకారం ఏదైనా ఒక భూమి వక్ఫ్‌భూమా, ప్రభుత్వ భూమా అనే సమస్య వచ్చినప్పుడు లేదా షియాలదా, సున్నీలదా అనేదాన్ని వక్ఫ్ బోర్డు నిర్ణయిస్తుంది. అదే తుది పరిష్కారం అవుతుంది. దానిపై దావాలు వేయడానికి వీల్లేదు. అయితే వక్ఫ్ ట్రిబ్యునల్ మీద హైకోర్టుకు వెళ్లే అవకాశం మాత్రం ఉంటుంది. కొత్త చట్టంలో ఫైనల్ అనే పదాన్ని తొలగించి అన్ని కోర్టుల్లోనూ కేసులు వేసుకునే అవకాశం కల్పించారు. దీనిలో స్పష్టత లోపించింది. నిజంగా దీనిపై చిత్తశుద్ధి ఉంటే ట్రిబ్యునల్ తీర్పు ఫైనల్ కాకపోతే అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు వెళ్లేలా ప్రతిపాదనలుగానీ, సూచనలుగానీ చేయాలి, కానీ అటువంటిదేమీ లేదు. దీనివల్ల సివిల్ కోర్టుకు వెళితే వెంటనే తీర్పులు వెలువడవు. దీర్ఘకాలం వివాదాలు కొనసాగుతాయి. వాస్తవంగా గతంలో ఉన్న చట్టంలో ఆరు, ఏడు సెక్షన్లలో ట్రిబ్యునల్ అధికారాల విషయాన్ని ప్రస్తావించిన సమయంలో అది ఇచ్చే ప్రతి తీర్పునూ తుది తీర్పు అని పొందుపరిచారు. కొత్తచట్టంలో తుది తీర్పు కాదు అని చేర్చారు. ఫలితంగా ట్రిబ్యునల్ తీర్పు చివరిది కాకుండా పోతుంది.

ప్రశ్న : వక్ఫ్ సర్వేలో తెచ్చిన సవరణలు ఏమిటి ? దీనివల్ల కలిగే నష్టం ఏమిటి ?

పొత్తూరి : వక్ఫ్ చట్టం 1995 సెక్షన్ 4లో సర్వే కమిషన్ వ్యవహారాలు ఉన్నాయి. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అవసరాన్ని బట్టి సర్వే కమిషనర్‌ను, అసిస్టెంట్లను నియమించొచ్చు. 2024లో వచ్చిన సవరణలు ఏమిటంటే సర్వే కమిషనర్ అనే అంశాన్ని తొలగించారు. దాన్ని కలెక్టర్‌కు అప్పగించారు. దీనిలో పెండింగ్ అంటే సర్వే కమిషనర్ దగ్గర పెండింగ్‌లో ఉంటే సర్వే కమిషనర్ దాన్ని కలెక్టర్‌కు ట్రాన్స్‌ఫర్ చేయాలని, దాన్ని రెవెన్యూ చట్టాల్లో ఉన్న విధంగా సర్వే చేస్తారనే విధంగా నిబంధనలు పొందుపరిచారు. సెక్షన్ 5 ప్రిన్సిపల్ యాక్టులో ఒకసారి సర్వే చేసి గుర్తించిన తరువాత లిస్టును పబ్లిష్ చేస్తారు. దీన్ని పబ్లికేషన్ ఆఫ్ వక్ఫ్ అంటారు. దానిలోనూ మార్పులు తీసుకొచ్చారు. సర్వే చేసిన వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. దీనిలో వక్ఫ్ చేసిందెవరనే అంశాన్ని అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఫైనల్ జాబితా ప్రకటించిన తరువాత అభ్యంతరాలపై గతంలో ఏడాదిలోపు కేసులు వేసుకునే అధికారం ఉంటుంది. దాన్ని ప్రస్తుతం రెండేళ్లకు పొడిగించారు. అనంతరమూ కేసులు వేసుకునే అవకాశం కల్పించారు. అంటే వివాదం నిరంతరం కొనసాగుతుంది.

ప్రశ్న : ఈ చట్టంలో వక్ఫ్ బోర్డు, ట్రిబ్యునల్ అధికారాలను తగ్గించారా ?

పొత్తూరి : గతంలో ఎవరైనా వ్యక్తి వక్ఫ్ చేయాలనుకుంటే సెక్షన్ 36 ప్రకారం బోర్డుకు దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై బోర్డు విచారణ జరుపుతుంది. ఇది కరెక్టా కాదా అనేది నిర్ధారిస్తుంది. ప్రస్తుతం ఈ అధికారాలను కలెక్టర్‌కు ఇచ్చారు. ఆయన వివాదాలు ఉన్నాయని నివేదిక ఇస్తే పరిష్కారం అయ్యే వరకూ వక్ఫ్ చేయడానికి వీల్లేదు. కొత్తగా ప్రవేశపెట్టిన సెక్షన్ 3సిలో ఒక భూమి ప్రభుత్వ భూమి అని నిర్ధారిస్తే అంటే ఐడెంటిఫైడ్, లేదా డిక్లేర్డ్ అనే పదాలు ఉపయోగించారు. అలా చేస్తే ఆ భూమి వక్ఫ్ భూమి కింద చెల్లుబాటు కాదు. దీనిపై కలెక్టర్ విచారణ జరిపి, ఆయన నివేదిక ప్రకారం వక్ఫ్ భూమిగా మారుతుంది. ప్రభుత్వ భూమిగా నిర్ధారించేందుకు కలెక్టర్‌కు ఎక్కువ అధికారాలు ఇచ్చారు. అదే సమయంలో సెక్షన్ 40లో వక్ఫ్ భూమలుపై వక్ఫ్ బోర్డుకు ఉన్న అధికారాలను తొలగించారు. సెక్షన్ 52(ఏ)లో వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అయితే కఠిన శిక్షలు ఉండేవి. అవన్నీ నాన్‌బెయిలబుల్, ఇప్పుడు వాటిని తొలగించారు. ఫలితంగా వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అయితే తప్పు చేసిన వారు భయపడే పరిస్థితి ఉండదు. అంటే బెయిలబుల్, సాధారణ నేరాల మాదిరి మార్చారు. ఇది కూడా వక్ఫ్ వ్యవస్థకు వ్యతిరేకమైనదే. రిజిస్ట్రేషన్ పూర్తికాని కేసుల్లో ఏ కోర్టులో కేసులు వేయకూడదు అనే నిబంధన తీసుకొచ్చారు. అంటే కొత్త చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ జరగని వక్ఫ్ భూముల విషయంలో ఏ కోర్టు కూడా కేసులు స్వీకరించకూడదనే నిబంధన తెచ్చారు. ఇది కూడా వక్ఫ్ చేయాలనుకునేవారికి ఇబ్బంది కలిగించే నిబంధన.

మరో రూ.3 వేల కోట్ల రుణానికి ఇండెంట్

- రెండున్నర నెలల్లో ఆరుసార్లు రూ.17 వేల కోట్ల అప్పు
- ఆర్‌బిఐ వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. అధికారంలోకి వచ్చిన రెండున్నర నెలల్లోనే ఏకంగా ఆరుసార్లు రూ.17 వేల కోట్ల అప్పునకు రాష్ట్ర ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఈ నెల 27న రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నిర్వహించబోయే ఆక్షన్ (వేలం)లో రూ.3 వేల కోట్ల అప్పునకు ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. నిధులను సమకూర్చే ప్రక్రియలో భాగంగా అప్పు కోసం ఆస్తులను ఇండెంట్ పెడుతుంది. అందులో భాగంగా ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ బాండ్లను కూటమి ప్రభుత్వం వేలానికి పెట్టింది. ఇప్పటి వరకు ఐదుసార్లు రూ.14 వేల కోట్ల అప్పునకు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (ఈ-కుబేర్) వేలం వేయనుంది. కాంపిటేటివ్, నాన్ కాంపిటేటివ్ బిడ్స్ రూపంలో ఆర్‌బిఐ వాటిని విక్రయిస్తుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే జూన్ 11న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో రూ.2 వేల కోట్ల అప్పునకు, 25న వేలంలో రూ.2 వేల కోట్ల అప్పునకు, జులై 2న రూ.5 వేల కోట్లు, 16న రూ.2 వేల కోట్లు, 30న వేలంలో రూ.3 వేల కోట్ల అప్పునకు రాష్ట్ర ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది.

27న వేలంలో రూ.3 వేల కోట్ల అప్పునకు ఇండెంట్

తాజాగా ఆగస్టు 27న నిర్వహించనున్న స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో రూ.3 వేల కోట్ల అప్పునకు ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే మూడు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 12 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 17 ఏళ్లు, మూడో రూ.1,000 కోట్ల బాండు 22 ఏళ్ల కాలపరిమితి ఉంటుంది. ఈ సెక్యూరిటీ బాండ్లను వ్యక్తులు, సంస్థలు కొనుగోలు చేయొచ్చు. కాంపిటేటివ్ విధానంలో బాండ్లను కొనదలిచిన వారు ఈ నెల 27 (మంగళవారం)న ఉదయం 10:30 నుంచి 11:30 గంటల మధ్య కాంపిటేటివ్ (పోటీ) బిడ్స్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఉదయం 10.30 నుంచి ఉదయం 11 గంటల మధ్య నాన్ కాంపిటేటివ్ (పోటీ లేని) బిడ్స్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది.



అయ్యన్నపాత్రుడిని సన్మానిస్తున్న ఎన్‌టిఆర్ కల్చరల్ అసోసియేషన్ నాయకులు

మహిళలను ప్రోత్సహించిన ఎన్‌టిఆర్

- చరిత్రను భావితరాలకు చెప్పండి
- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహించిన వారిలో ఎన్‌టిఆర్ కీలకమైన వ్యక్తి అని శాసనసభ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు తెలిపారు. గుంటూరులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో ఎన్‌టిఆర్ కల్చరల్ అసోసియేషన్ 55వ వసంతాల వేడుక ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పీకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విభిన్న పాత్రల్లో ఎన్‌టిఆర్ రాణించారని తెలిపారు. ఏ పాత్రలో నటించినా ఆయన జీవించేవారని, ఒకేసారి మూడు నాలుగు పాత్రల్లో కూడా నటించిన ఘనత ఎన్‌టిఆర్‌కే దక్కుతుందన్నారు. కుటుంబ విలువలు చాటి చెబుతూ అనేక సినిమాలు తీశారని తెలిపారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి ఎన్‌టిఆర్ అని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. మహిళలంటే ఆయనకు ఎంతో గౌరవమని, వారిని చదువులో ప్రోత్సహించేందుకు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించారని తెలిపారు. ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ ఎన్‌టిఆర్‌కు తెలుగు భాషాభిమానంతోపాటు దేశభక్తి ఎక్కువన్నారు. పాలకుడిగా పథకాలకు తెలుగు పేరు పెట్టిన గొప్ప వ్యక్తి ఎన్‌టిఆర్ అని కొనియాడారు. సినీ నిర్మాత వైవిఎస్ చౌదరి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను సన్మానించారు. అసోసియేషన్ సభ్యులు జుజ్జూరి మల్లికార్జునరావు, చిర్రావూరి సాంబశివరావు, దారపనేని శివప్రసాద్, కేతిపల్లి సాంబశివరావు, ఎం.సుబ్బారావు, రావిపాటి సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గంపలగూడెం (ఎన్‌టిఆర్ జిల్లా)

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని అనుములంక గ్రామానికి చెందిన గొల్లమందల కృష్ణ (62) కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. గత కొంత కాలంగా డయాలసిస్ కూడా చేయించుకుంటున్నారు. ఇటీవల వ్యాధి తీవ్రమైంది. దీంతో హైదరాబాద్ ప్రయివేటు ఆస్పత్రికి ఆయనను తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కృష్ణ మృతదేహాన్ని సిపిఎం నాయకులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం సందర్శించి నివాళులర్పించారు.

శ్రీరామమూర్తి జీవితం ఆదర్శనీయం

- సంస్మరణ సభలో మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు (పశ్చిమగోదావరి జిల్లా)

వలవల శ్రీరామమూర్తి జీవితం ఆదర్శనీయమని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఉపాధ్యాయునిగా, సిపిఎం నేతగా, రైతు ఉద్యమనేతగా ఆయన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా సీనియర్ నేత వలవల శ్రీరామమూర్తి సంస్మరణ సభ పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని అంబేద్కర్ భవనంలో ఆదివారం జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. శ్రీరామమూర్తి ఉపాధ్యాయ వృత్తిని వదిలి సమసమాజ స్థాపన కోసం సిపిఎంలో చేరారని తెలిపారు. ఆయన తన కళ్లను ఇరువురికి దానం చేయడం, తన శరీరాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనకు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి శ్రీరామమూర్తి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఎందరో ఉత్తమ విద్యార్థులను, ఉపాధ్యాయులను తయారు చేశారని చెప్పారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ .. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాలనూ కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేసుకుపోతోందని తెలిపారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా శ్రీరామ మూర్తి పోరాటం చేశారన్నారు. ఈ సందర్భంగా అమరజీవి వలవల శ్రీరామమూర్తిపై ప్రచురించిన ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషబాబు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, జెవిఎన్ గోపాలన్, ఛాంబర్ కార్యదర్శి కెవి.సీతారాం, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి, శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు రామకృష్ణ, రవీంద్ర పాల్గొన్నారు.



శ్రీరామమూర్తి సంస్మరణ సభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

ఉర్దూ బోధన కృత్యాలను వినియోగించుకోవాలి

- సమగ్రశిక్షా అడిషనల్ డైరెక్టరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉర్దూ బోధనలో బోధనాభ్యసన సామగ్రి (టిఎల్‌ఎం) సద్వినియోగపరుచుకోవాలని సమగ్రశిక్షా అడిషనల్ డైరెక్టరు ఎ సుబ్బారెడ్డి చెప్పారు. సమగ్రశిక్షా ఆధ్వర్యాన జరుగుతున్న ఉర్దూ ద్విభాషా బోధన అభ్యసన సామగ్రి కార్యాశాల శనివారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉర్దూ బోధన అభ్యసన సామగ్రి తయారీలో ప్రతిభ, అనుభవం ఉన్న 40 మంది రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారని తెలిపారు. 150 టిఎల్‌ఎం అంశాలు, ఉర్దూ వ్యాకరణ పుస్తకం రూపొందించారని చెప్పారు.

నేటి నుంచి జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు సోమవారం నుంచి నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఎమ్‌డి గిరీశా ఆదేశించారు. ఈ వేడుకలపై 26 జిల్లాల క్రీడాభివృద్ధి అధికారులు, యూత్ సర్వీస్ ముఖ్య కార్యనిర్వహణాధికారులతో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.



మాట్లాడుతున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి సూరిబాబు

విద్యుత్తు కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి సూరిబాబు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్ సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యుత్ రంగంలోని మూడు డిస్కంల పరిధిలో 23500 కాంటాక్ట్ కార్మికులు, ట్రాన్స్‌కో, జన్‌కో, డిస్కం మూడు డిస్కంలో పరిధిలో 17500 మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వీరందరికీ థర్డ్ పార్టీ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారని ఈ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే ఈ కార్మికులందరినీ విలీనం తీసుకొని నేరుగా వారికే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ ఐదున తిరుపతిలో సిఎండి కార్యాలయం ఎదుట చేపడుతున్న ధర్నాను కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే దశలవారీ పోరాటాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. అంతకుముందు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నబి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం నాగమణి, ఎస్ నాగేంద్రకుమార్, యూనియన్ నాయకులతో కలిసి సూరిబాబు తిరుపతిలో చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన పోస్టరను ఆవిష్కరించారు.

రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ మరమ్మతులకు నిధులు

- సిఎంకు రామకృష్ణ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్నూలు జిల్లా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం మరమ్మతులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు ఆదివారం ఆయన లేఖ రాశారు. కర్నూలు జిల్లా మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలు కరువుతో అత్యంత వెనుకబడిన ప్రాంతాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాల అభివృద్ధి జరగాలంటే 4 టిఎంసిలతో రాజోలి బండ కుడికాలువ (ఆర్‌డిఎస్) నిర్మాణమే ఏకైక శరణ్యమని అన్నారు. 2014లో టిడిపి ప్రభుత్వ హయాంలో పాలనాపరమైన ఆమోదం తెలిపారని, 2019లో ఏర్పడిన వైసిపి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయన్నారు.

ఎవరి ప్రయోజనం కోసం యుపిఎస్? : ఎపిసిపిఎస్ఇఎ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన యునిఫైడ్ పెన్షన్ స్కీం (యుపిఎస్) ఎవరి కోసమని ఎపిసిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రశ్నించింది. 35-40 ఏళ్ల సర్వీస్ చేసిన వ్యక్తి యుపిఎస్‌లోకి వెళ్లడమంటే తన పాన్ ఖాతాలో ఉన్న సంపదను మొత్తం ప్రభుత్వ పుణ్యానికి ఇవ్వడమేనని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సతీష్, సిఎం దాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగి వద్ద ఎలాంటి కాంట్రిబ్యూషన్ మినహాయించకుండా పెన్షన్ పథకాన్ని ఇవ్వండని డిమాండ్ చేశారు. అలా కాకుండా గ్యారెంటీ స్కీం అంటూ గారడీ చేసే ప్రయత్నాలు చేయొద్దని, గత అనుభవాలు పరిశీలించుకోవాలని సూచించారు.

అచ్యుతాపురం సెజ్ ప్రమాదంపై అఫిడవిట్లు

- దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్‌జిటి నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదానికి దారితీసిన కారణాలపై సెప్టెంబరు 23లోపు అఫిడవిట్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ప్రధాన బెంచ్ ఆదేశించింది. ఎన్‌జిటి ఛైర్మన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, జ్యుడీషియల్ సభ్యుడు జస్టిస్ అరుణ్ కుమార్ త్యాగి, ఎక్స్‌పర్ట్ సభ్యుడు ఎ.సెథిల్‌వెల్‌లతో కూడిన ట్రిబ్యునల్ విచారణ జరిపింది. సుమోటో కింద ఈ కేసు తీసుకుని విచారణ జరిపిన ఎన్‌జిటి నాలుగు పేజీల ఆర్డర్ ఇచ్చింది. ఈ ప్రమాదంలో 17 మంది మరణించారని, 20 మంది గాయపడ్డారని ట్రిబ్యునల్ గుర్తించింది. పర్యావరణ నిబంధనలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయని తెలిపింది. ఈ ఘటన చెన్నైలోని ఎన్‌జిటి బెంచ్ పరిధిలోకి వస్తుందని, కేసును అక్కడికి బదిలీ చేస్తున్నామని పేర్కొంది.

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ, అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ హెల్త్ డైరెక్టరేట్ డైరెక్టర్ ఈ ప్రమాదానికి కారణాలను వివరిస్తూ సెప్టెంబరు 23లోపు ఎన్‌జిటి ముందు అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 30కు వాయిదా వేసింది.


ఎంతటివారైనా ఉపేక్షించం

- తెలంగాణ సిఎం రేవంత్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో



చెరువుల్ని కబ్జాచేసి నిర్మాణాలు చేపడితే ఎవర్నీ ఉపేక్షించేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్ నార్సింగి కోకాపేటలోని గ్లోబల్ హరేకృష్ణ మూవ్‌మెంట్, అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హెరిటేజ్ టవర్ నిర్మాణ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆ అక్రమ కట్టడాల్లో ప్రభుత్వాలను శాసించే వ్యక్తులు ఉన్నారని తెలుసని, అయినా తాను వారి ఒత్తిళ్లను పట్టించుకోబోనన్నారు. వరదల నుంచి ప్రజల్ని శాశ్వతంగా రక్షించేందుకు అప్పటి నిజాం నవాబు ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆధ్వర్యంలో గొలుసుకట్టు చెరువులు నిర్మించారని గుర్తుచేశారు. వాటిని అక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో చెరువుల్లోకి వెళ్లాల్సిన నీళ్లు రోడ్లపైకి వచ్చి, హైదరాబాద్ వంటి పట్టణాల్లో జనజీవనం అస్తవ్యస్థం అవుతోందని వివరించారు. కళ్ల ముందు చెరువులు అన్యాక్రాంతమవుతుంటే, చూస్తూ ఊరుకుంటే ఇక తాను ప్రజాప్రతినిధిగా ఉండి ఏం ప్రయోజనం అని ప్రశ్నించారు. ఇటీవల బెంగుళూరు, చెన్నై, వాయనాడ్ వంటి ప్రాంతాల్లో వరదలు వచ్చినప్పుడు ఎలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయో కళ్లారా చూశామని, అలాంటి దుస్థితి హైదరాబాద్‌కు రానీయబోనని స్పష్టంచేశారు.



"రాసిందంతా సాహిత్యం కాదు. అందమైన భాషలో సత్యాన్ని వ్యక్తీకరిస్తూ మనస్సు మీద ప్రభావాన్ని కలిగించేది మాత్రమే సాహిత్యం."
– ప్రేమ్‌చంద్

తప్పించుకోకూడదు



క్షమించు తల్లీ! ఈ దేశాన్ని ...
సిగ్గుపడుతుంది ఈ ఘోరానికి.
కలుషితమైన రాజకీయం
విషం కక్కే స్వార్థం
పచ్చి అబద్ధమైన నమ్మకం
కుళ్ళిపోయిన వ్యవస్థలు
వీటి మధ్య నలిగిన నీ జీవితం
అక్షరాలా అమలుకాని చట్టాలకు అవమానం!

డబ్బు పిచ్చితో మదమెక్కిన మృగాల మధ్య
విలువల్లేని విష వలయాల మధ్య
బలికాబడిన నీ జీవితం ఈ దేశంపై
సామాన్యులు కోల్పోయిన నమ్మకానికి సాక్ష్యం.

మనిషిని కాపాడే వైద్యశాలలు శ్మశానాలుగా
పౌరులను రక్షించాల్సిన నాయకులు రాక్షసులుగా
వ్యవస్థను కాపు కాయాల్సిన పార్టీలు
కిరాతకంగా మారితే ...
ఎలా ఈ దేశంలో చదువులు
ప్రజలకి సేవ చేసేది?
ఎలా ఈ సంఘంలో నీతి, న్యాయం
నిజాలని తోడుగా నిలచేది?


కొనఊపిరితో కొట్టుకుంటుంది కోర్టులపై ఆశ..
బలం, బలగాన్ని కోల్పోతున్న నిజాయితీ
ఒంటరిగా ఓటమితో హత్యతో పాటు
అత్యాచారానికి గురై
బిడ్డల దుస్థితికి దేశం
గుండెలు పగిలేలా ఏడుస్తోంది!

ఇంకా చూస్తారెందుకు?
నిజాలు బహిరంగంగా వీధికెక్కి రోదిస్తూ
సూటిగా గుండెల్లో ప్రశ్నలతో
ఈ నరకాలకు కారకాలని
గుచ్చి గుచ్చి అడుగుతుంటే
ఈ దేశంలో యువతకు,
ఆడబిడ్డలకు, చదువులకు నిద్ర లేదు..
ఈ దుస్థితికి శాశ్వత పరిష్కారం చేయలేని
బలహీనులమా?
నడివీధిలో ప్రతి తప్పునీ బహిరంగంగా
ఉరి తీయాలి
అప్పుడే నీ ఆత్మకు శాంతి అని
ఈ దేశం మొత్తం ఒప్పుకునే నిజం..
ఈ నిజం అమలులో
ఏ దుర్మార్గం తప్పించుకోకూడదు జాగ్రత్త!

– చందలూరి నారాయణరావు
97044 37247

దిగంతం

బహుశా తలపుల్ని ఖాళీ చేస్తున్నప్పుడో
తలుపులు మూసేస్తున్నప్పుడో నువ్వు వచ్చావు
కాస్తంత సమయం కోరుతూ..
ఒకానొక సందర్భమది
దాదాపు ఆనందం ఆవిరౌతున్నప్పుడో
వసంతం వాలిపోతున్నప్పుడో నువ్వు వచ్చావు
ఎవరు చూడని ఏకాంత స్వప్నమది
పూలవనాలు
వెన్నెల మైదానాలు
అందమైన జలపాతాలు
ఆనందభైరవీ రాగాలు
రెప్పపాటు సందర్భనమది
రమారమి కాలం కరిగిపోయాకో
కన్నీళ్లు ఆవిరై పోయాకో
'అర్ధాంతరమై' నువ్వు వెళ్లిపోయావు
రాత్రి కాని రాత్రి
కాలం కాని కాలం నదిలో 'ముంచి'
విషాదంలో పెనువిషాదంలా
శూన్యంలో మహాశూన్యంలా
దిగంతాల సరిహద్దులు చేరువేళ
నీళ్లు కాదు కదా
కన్నీటి బొట్టు కూడా మిగిలి లేదు
నిన్ను అభిషేకించి పంపడానికి
అర్పించి
తెరమూయడానికి ...



(కాశీభట్ల వేణుగోపాల్ గారి స్మృతిలో...)
– లోసారి సుధాకర్, 99499 46991

సన్నిధానం శర్మకు అద్దేపల్లి సాహిత్య పురస్కారం

ప్రముఖ కవి, విమర్శకుడు అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య పురస్కారం 2024వ సంవత్సరానికి గానూ ప్రముఖ సాహితీవేత్త సన్నిధానం నరసింహశర్మకు ప్రదానం చేస్తున్నాము. సన్నిధానం కవిగా, విమర్శకునిగా వక్తగా ఎంతో ప్రసిద్ధి చెందిన వారు. గౌతమీ గ్రంథాలయ ఉద్యోగిగా ఎంతోమంది కవులకూ పరిశోధకులకూ సహకరించడమే కాక వారితో సాహిత్య బంధాన్ని పెనవేసుకున్నవారు. 2017 నుంచి తెలుగులో కవిత్వ విమర్శకు అద్దేపల్లి రామమోహనరావు పేరిట ఆయన జన్మదిన సందర్భంగా సెప్టెంబర్‌లో సాహిత్య పురస్కారం ఇస్తున్నాము. రాచపాళెం చంద్ర శేఖర రెడ్డి, కడియాల రామమోహనరాయ్, కాత్యాయనీ విద్మహే, పాపినేని శివశంకర్, కె.పి. అశోక్ కుమార్, మేడిపల్లి రవికుమార్‌లకు ఈ పురస్కారం ఇచ్చాము. సెప్టెంబర్ 8వ తేదీన కాకినాడలో జరిగే సభలో ఈ పురస్కార ప్రదానోత్సవం జరగనుంది.

– అద్దేపల్లి ఉదయ భాస్కరరావు,
అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య పురస్కార వేదిక

29న గిడుగు జాతీయ పురస్కారాల ప్రదానం

నవ్యాంధ్ర రచయితల సంఘం సారధ్యంలో గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్– శంకరం వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకలు ఆగస్టు 29, గురువారం ఉదయం 10 గంటలకు విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో గిడుగు జాతీయ భాషా సాహిత్య కళా సేవా రంగాల పురస్కారాల ప్రదానం, తెలుగు భాషా పరిరక్షణపై కవి సమ్మేళనం వుంటాయి. నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు బిక్కి కృష్ణ సభాధ్యక్షత వహించే ఈ వేడుకలకు ఎన్టీఆర్ లిటరేచర్, వెబ్సైట్ కమిటీ ఛైర్మన్ టి.డి.జనార్ధన్ ముఖ్య అతిధిగా హాజరవుతారు. ఆంధ్రప్రభ సంపాదకులు వైయస్సార్ శర్మ, తెలుగు వన్ వ్యవస్థాపకులు కంఠంనేని రవిశంకర్, జియస్టి కమిషనర్, సాహితీవేత్త జల్లి విద్యాధరరావు, గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీమతి కాంతికృష్ణ, శంకరం వేదిక అధ్యక్షులు యలవర్తి ధనలక్ష్మి, సంఘసేవకులు కె.శ్రీనివాస్ గౌడ్ హాజరవుతారు. వివరాలకు 92464 15150 నెంబరులో సంప్రదించవచ్చు

– కలిమిశ్రీ, నవ్యాంధ్ర రచయితల సంఘం


'రాత్రి సింఫని'కి పాలమూరు సాహితి అవార్డు

ప్రముఖ కవి డా.బాణాల శ్రీనివాసరావు రచించిన 'రాత్రి సింఫని' కవితా సంపుటానికి 2023 సంవత్సరానికి గాను పాలమూరు సాహితి అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డు కార్యక్రమం సెప్టెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ హై స్కూల్లో గల కాళోజీ హాలులో ఉదయం 10 గంటలకు జరుగుతుంది.

– డా. భీంపల్లి శ్రీకాంత్, వ్యవస్థాపకులు
పాలమూరు సాహితి అవార్డు. 90328 44017

తెలుగు భాషా సేవలో ఆ ఇద్దరు





ఈనెల 29 గిడుగు జయంతి, వచ్చేనెల 21 గురజాడ జయంతి

సందర్భం

ఆ ఇద్దరిలో ఒకరు గిడుగు రామ్మూర్తి పంతులు, మరొకరు గురజాడ వేంకట అప్పారావు. ఒకరు శ్రీకాకుళానికి 20 మైళ్ల దూరంలో ఉన్న పర్వతాలపేటలో ఆగస్టు 29, 1863లో జన్మిస్తే, మరొకరు విశాఖ జిల్లా, యలమంచిలికి దగ్గరలో ఉన్న రాయవరంలో సెప్టెంబరు 21, 1862లో జన్మించారు. వీరిద్దరూ విజయనగరంలోని మహారాజావారి ఉన్నత పాఠశాలలో సహపాఠులై ఆంగ్లం, సంస్కృతం, చరిత్ర పట్ల అమితమైన శ్రద్ధ చూపేవారు. వృద్ధిలోకి వస్తారనుకున్న పిల్లలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులైన చంద్రశేఖరశాస్త్రి ఇంటిదగ్గర పాఠాలు చెప్పేవారు. అక్కడా వీరిద్దరూ సహాధ్యాయులయ్యారు. అప్పటి నుంచి వీరు ఒకరికొకరు మిత్రులు, సన్నిహితులు, ఆప్తులయ్యారు. తరువాత ఒకరు పర్లాఖిమిడి మహారాజా కళాశాలలో, మరొకరు విజయనగరం మహారాజా కళాశాలలలో ఉపన్యాసకులుగా ప్రసిద్ధులయ్యారు.

ఏ జాతి సంస్కృతిలోనైనా ఆహారం తరువాత కీలకమైన పాత్ర పోషించేది భాష. మానవ సమూహాలు తమ అనుభవాలను, కష్టసుఖాలను పంచుకోవడానికి భాషను సృష్టించుకుంటాయి. మనిషికీ మనిషికీ మధ్య సజీవ సంబంధాలు నెలకొల్పే వాహిక భాష. అటువంటి భాష మనిషికీ మనిషికీ మధ్య గుదిబండగా నిలిచిన వైనాన్ని ఇద్దరూ స్పష్టంగా దర్శించారు. ఈ దేశవాసుల వాడుకలోలేని భాషలో భారతీయ ప్రాచీన సాహిత్యమంతా వచ్చింది. అదే సంస్కృత భాష.

తెలుగు భాష లిఖితరూపంలో మనకు దొరికిన తొలినాళ్లలో అది ఆనాటికి ప్రజల వాడుకలో ఉన్నట్లు శాసనాల్లోని సరళ వాక్యాల ద్వారా తెలుస్తుంది. కాలక్రమంలో శాసనభాషలో రెండు రూపాలు వెలిసాయి. ఒకటేమో చిన్నచిన్న మాటలతో సూటిగా రాసిన భాష. చాలా దాన శాసనాల్లో ఈ భాషారూపం కనిపిస్తుంది, రాజులు, సేనాపతుల విజయవార్తలను ప్రకటించే శాసనాల్లో భాష క్రమంగా కఠినమై, సంస్కృత భూయిష్టమై ప్రజావ్యవహార భాషకు దూరం కావడం మొదలయింది. ఈ స్థితి క్రీస్తు శకం 8వ శతాబ్దం నుంచి క్రమ పరిణామం చెంది చివరకు కావ్యభాష అనే కృత్రిమ రూపాన్ని మనకు ప్రసాదించింది.

నన్నయకు 200 ఏళ్ల ముందే 'కొరవ' శాసనం ద్వారా ఈ కృత్రిమ కావ్య భాష వచనంలో కూడా స్థానం సంపాదించుకున్నట్లు మనకర్థమవుతుంది. నన్నయ నాటికి ఈ రూపం సంపూర్ణంగా నిలదొక్కుకుంది. తరువాత వచ్చిన ప్రబంధ సాహితీకర్తలందరూ రూపంలోను, సారంలోను నన్నయను అనుసరించినవారే. 1565లో తళ్లికోట యుద్ధంలో విజయనగరం సామ్రాజ్యం కుప్పకూలిపోయాక ఆంధ్రసాహిత్యంలో పొద్దుగుంకి చీకటిపడింది. మూడు శతాబ్దాల అనంతరం గురజాడతో మళ్లీ తూర్పు భళ్లున తెల్లవారింది.

గురజాడ తరువాత వాడుకభాషలో కథా సాహిత్యాన్ని అద్భుతంగా నిర్వహించిన శ్రీపాద ఈ సందర్భంలో గురజాడనుద్దేశించి 'భాష ఎంత శృంఖలాబద్ధమైపోవాలో, అంత శృంఖలాబద్ధమైపోయాకా, సాహిత్యం ఎంతగా దిగజారిపోవాలో, అంతగా దిగజారిపోయాక, భవిష్యత్తు ఎంతగా అంధకారమైపోవాలో అంతగా అంధకార బంధురమైపోయాక పుట్టుకొచ్చాడీ మహాకవి' అన్న మాటలను బట్టి ఇరవయ్యో శతాబ్ది ఆరంభానికి తెలుగు భాషా సాహిత్యాల స్వరూపమెట్లా ఉందో మనకు స్పష్టమౌతుంది.

గిడుగు పిడుగే, ప్రజాభాషకు సాహిత్యంలో స్థానం ఉండాలని, అసలే అత్యధిక సంఖ్యాకులు నిరక్షరకుక్షులుగా ఉన్న సమాజంలో ప్రాచీన రూపాలను, సంస్కృతభాషా మర్యాదలనూ చొప్పించి కృత్రిమంగా నిర్మించిన భాషకు బహుముఖమైన ఆధునిక సారస్వతంలో స్థానం లేదని వాదించిన మొట్టమొదటి భాషా శాస్త్రవేత్త. సమాజంలో భాషా విషయకంగా వచ్చిన, వస్తున్న సిద్ధాంతాలనూ, ఆచరణలనూ గుర్తించిన తొలి తెలుగు భాషా శాస్త్రవేత్త గిడుగు. ఈ సందర్భంలో భారతీయ భాషల గురించి ప్రపంచ భాషా శాస్త్రవేత్తల అభిప్రాయాలను ఇక్కడ గమనించవలసిన అవసరముంది.

"The Vernacular has been split into two sections. The tongue which is understanded of the people and the literary dialect known only through the press, which is not intelligible to those who donot know Sanskrit. Literature has thus being divorced from the grate masses of the populations and also to the literary classes" (GREARSON)

'భారతీయ భాషలకు గమనార్హమైన ఒక ప్రత్యేక లక్షణముంది. వీటిలో రచనలు వెలువడ్డం ప్రారంభం కాగానే, భాషా శైలులు ప్రజాజీవితం నుంచి వేరుపడి తన స్వంత వ్యాకరణమూ, పదజాలమూ ఉన్న ఒక గ్రాంధిక భాషగా రూపొందే ధోరణిని అలవర్చుకుంటుంది.' (కాడ్వెల్, ద్రావిడ భాషల తులనాత్మక వ్యాకరణం).

'దక్షిణ భారతదేశ భాషలలో ప్రతీ ఒక్కదానికి కవిత్వభాష, వ్యావహారిక భాష ఉన్నాయి. వీటిమధ్య శేగ్జన్ భాషకూ, ఇంగ్లీషు భాషకు మధ్య ఉన్నంత తేడా ఉంది. (సి.పి.బ్రౌన్, తెలుగు, ఇంగ్లీషు, నిఘంటు పీఠిక).


భాషకు సంబంధించి తన ఆలోచనతో ఏకరూపత కలిగిన ఈ అభిప్రాయాలన్నీ గిడుగును వాడుకభాషా ఉద్యమానికి పురికొల్పడమే కాకుండా ఎంతో విశ్వాసాన్ని, ధైర్యాన్ని కల్పించాయి. గిడుగు సిద్ధాంత ప్రవక్త. వాద వివాదాల సందర్భంగా పండితులనుద్దేశించి రాసిన భాష, ఖండన గ్రంథాల్లో రాసిన భాష సహజంగా క్లిష్టంగానే ఉండేది.

ఇక గురజాడ విషయానికి వస్తే ఆయన తన పరిశీలనా, అధ్యయనాల ద్వారా వాడుక భాషపై సాహిత్య భాష (గ్రాంధిక భాష) ఆధిపత్య, ప్రభావాలకు గల మూలాలను గ్రహించినట్లుగా వివిధ సందర్భాల్లో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాల ద్వారా మనకు స్పష్టంగా అర్థమౌతుంది. 'సంకుచిత, సామాజిక, రాజకీయ సాహిత్యాదర్శాలది పైచేయిగా ఉన్న సామాజిక పరిస్థితుల వలన కావ్యభాష ఉత్పన్నమయింది. విశాల ప్రజానీకం, ప్రభువర్గం కోసమే బతికేది, శ్రమించేది, ఆనాడు సూద్రుడు చదువుకోవడమే ఒక నేరం'. 'విశాల ప్రజానీకం చదువుకోవడం, పూర్వాచార సాంప్రదాయంలో భాగం కాదు. నాడు జ్ఞానార్జన, సాహిత్యం, బ్రాహ్మణుని గుత్త సొమ్ము. అతని దృష్టిలో సంస్కృతం పెట్టిన ఒరవడి పవిత్రమైనది, మీరరానిది. తెలుగు సాహిత్యం సంస్కృత ప్రభావంలో అంకురించింది. సంస్కృత సాహిత్యం క్షీణదశలో ఉన్న కాలంలో తెలుగు సాహిత్య సృష్టి ప్రారంభమైనందువల్ల క్షీణదశ లక్షణాలైన భాషా, కళా సాంప్రదాయాలు తెలుగు సాహిత్యంలో పాతుకుపోయాయి'. 'ఈ సందర్భంలో తెలుగు సాహిత్యానికి సంకెళ్లు వేసి కడుపుమాడ్చడమా? లేక దానికి జవసత్వాలనిచ్చి ఒక నాగరిక శక్తిగా చేయడమా అనేది మనపై ఆధారపడి ఉంది'. అంటూ ఈ దృష్టితోనే తను వివిధ తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కావ్యసృష్టికి అంకురార్పణ చేసి, పరాకాష్ఠ స్థాయిలో వాటిని అద్భుతంగా నిర్వహించిన మహాకవి గురజాడ.

గిడుగు జీవితమంతా ప్రత్యర్థి వాదాన్ని పరాస్తం చేయడంలోనే గడిచిపోయింది. సిద్ధాంతానికి అనువర్తన ప్రధానం. ఆచరణ సాధ్యం కాని ఏ సిద్ధాంతమూ నిలబడదు, బతకదు. సామాన్య రచనల్లో, వ్యావహారిక భాషా వాదాన్ని ప్రతిష్ఠాపించగల సత్తా ఉండదు. లక్ష గ్రంథాలకంటే ఒక మహా కావ్యం తెచ్చిపెట్టగలిగిన గౌరవం మిన్న. ఏ ఆదర్శం కోసమైతే జీవితాన్ని ధారపోస్తామో ఆ ఆదర్శపు ఔన్నత్యాన్ని బట్టి అతడు చరితార్థుడౌతాడని గ్రహించి, 'నాకు కావలసింది నా దేశ భాష, సజీవమైన తెలుగు భాష. నాది ప్రజల ఉద్యమం దానిని ఎవరినో సంతోష పెట్టడానికి వదులుకోలేను' అని ప్రకటించి వ్యావహారిక భాషకు మహాసాహితీ గౌరవం సంపాదించి పెట్టి గిడుగు ఆబోరు దక్కించినవాడు గురజాడ. దీనికి ప్రథమ సాక్షి 'ముత్యాలసరాలు', ప్రధాన సాక్షి 'కన్యాశుల్కం' ముఖ్యమైన సాక్షి 'దేవుళ్లారా మీ పేరేమిటి' వ్యావహారిక భాషా నిరూపకడు గిడుగు అయితే, ప్రతిష్ఠాపకుడు గురజాడ. ఈ వాదాన్ని నిలిపిన మరో మహాశక్తి తెలుగుజాతి.

– బి.వి.రామారావు

యానాదుల జీవన చిత్రం 'పాయి దరువులు'



యువ రచయిత కె.వి మేఘనాథ్ రెడ్డి రాసిన మొదటి నవల 'పాయి దరువులు'. ఇప్పటికే మేఘనాథ్ ఒక కవిత్వ సంపుటిని, మరో కథల సంపుటిని వెలువరించారు. ఈ పుస్తకం చదివిన వారెవరైనా నవలా ప్రక్రియలో ఇదే వారి మొట్టమొదటి పుస్తకమంటే నమ్మకపోవచ్చు. తెలుగు సాహిత్యంలో ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు, జీవనశైలిపై గత రెండు, మూడు దశాబ్ద కాలంలో చెప్పుకోదగ్గ సాహిత్య రచన రాలేదు. ఆ లోటును తీర్చడానికి కె.వి మేఘనాథ్ రెడ్డి ఈ నవల ద్వారా ఎంతో కొంత ప్రయత్నం చేశారు అనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

పాయి దరువులు అనేది యానాదుల బతుకు చిత్రం. యానాదుల జీవన శైలిని, వారి సంప్రదాయాలను మాత్రమే కాకుండా వారి మనసు లోతులను, వారి కష్టాల వైశాల్యాన్ని, వారి గుండెల్లో ఘనీభవించిన కన్నీటి బరువును ఈ నవల ఆవిష్కరించింది. ప్రతీకారం, పోరాటం నేపథ్యంలో స్త్రీ ప్రధాన పాత్రగా వచ్చిన నవలలు చాలా తక్కువే. చంద్రుడికో నూలుపోగు అన్నట్టు, ఆ నేపథ్యంలో లేక లేక వచ్చిన నవల ఇది.

స్త్రీ ఎప్పుడూ పురుషుడి ముందు పలుచనే. అందునా నాగరికత ఎరుగని ఆదివాసీ గిరిజన స్త్రీల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకమే! సరిగ్గా అదే పాత్రను తన నవలలో ప్రధాన పాత్రగా ఎంచుకున్నారు రచయిత. అనాదిగా తమ యానాది కుటుంబాలపై, మరీ ముఖ్యంగా యానాది స్త్రీలపై పెత్తందారులు చేసే పెత్తనాన్ని, దాష్టీకాన్ని, అన్యాయాన్ని, ఆధిపత్యాన్ని ఒక ఒంటరి స్త్రీ ఎలా ఎదుర్కొన్నది? అన్నదే ఈ పాయి దరువులు.

కథ మొత్తం చిన్నమ్మి అనే హుషారైన గిరిజన పిల్ల చుట్టూ తిరుగుతుంది. ఆమె ఊసులు, చేష్టలు, మాటలు పాఠకుడిని మురిపిస్తాయి. ఆమె ప్రేమ పాఠకుడిని మైమరిపిస్తుంది. ఆమె పాటలతో పాఠకుడు గొంతు కలుపుతాడు. ఆమె చిందులతోకాలు కదుపుతాడు. ఇవన్నీ నాణానికి ఒకవైపు మాత్రమే. నాణానికి మరోవైపు అన్నట్టు తరతరాలుగా యానాదులు ఎదుర్కొంటున్న అణచివేత, వారికి జరుగుతున్న అన్యాయం, శిధిలమైపోతున్న యానాది స్త్రీల మానప్రాణాలు పాఠకుడిని ఆవేదనకు గురిచేస్తాయి. ఆ అడవి బిడ్డలకు అడవితో ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుంది ఈ నవల. తల్లిని బిడ్డను, వేరుచేసి వేడుక చూసే దుర్మార్గుల చేష్టలకు గొడ్డలిపెట్టు ఈ నవల.

ఎవరి కథల్ని వారు రాసుకోవడం, ఎవరి కష్టాల్ని వారు చెప్పుకోవడం కాస్త సులభమైన పని. కానీ ఇతరుల జీవితాల గురించి రాయాలన్నా, ఇతరుల మనసుల్లోకి దూరి వారి కష్టాలను చెప్పాలన్నా అది కత్తిమీద సామే. కానీ మేఘనాథ రెడ్డి ఈ నవల ద్వారా యానాదుల జీవితాల్లోకి పరకాయ ప్రవేశం చేసినట్టు కనిపిస్తుంది. యానాదుల కష్టనష్టాలను, వారి జీవితాల్లోని ఆటుపోట్లను చాలా చాకచక్యంగా ఈ కథలో చెప్పగలిగారు. బహుశా యానాదులతో మమేకమవడం, వారితో చిక్కటి స్నేహాన్ని కలిగి ఉండడం వల్ల ఇది సాధ్యపడి ఉండవచ్చు. కేవలం సంభాషణలు మాత్రమే కాకుండా కథ మొత్తం చిత్తూరు జిల్లా, ఆ ప్రాంత చుట్టుపక్కల నివసించే యానాదుల యాసలో, వారి మాండలికంలోనే ఉంటుంది. అయినప్పటికీ నవల చకచకా చదివిస్తుంది. కొత్త పాఠకుడయినా సరే, ఓ ఐదారు పేజీలు శ్రద్ధగా చదివితే చాలు, ఇక అక్కడి నుంచి పాఠకుడి వేలు పట్టుకొని మరీ, కథ మొత్తాన్ని చదివిస్తారు రచయిత.


సమీక్ష

నవల చదివేటప్పుడు ప్రతి పేజీలోనూ రచయిత కష్టం, యానాదుల జీవితాలపై రచయిత చేసిన పరిశోధన మనకు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది. బొల్లి మేక ఈనేటప్పుడు పాఠకుడు ప్రసవ వేదనను అనుభవిస్తాడు. ఆ క్రమంలోనే లింగాలోడితో అనుబంధాన్ని పెంచుకుంటాడు. స్నేహం చేస్తాడు. పాపులమ్మలో తన అమ్మనో, అవ్వనో చూసుకుంటాడు. చిన్నమ్మి, ఆనందుడి ప్రేమకు తడిసి ముద్దవుతాడు. నారప్ప డప్పు కొడుతోంటే హుషారుగా అడుగులేస్తాడు. కథలో లీనమై చివరి వరకూ ఆపకుండా చదువుతాడు. నవల పూర్తయిన వెంటనే పాఠకుడి గుండె బరువెక్కుతుంది. కథను మరి కాస్త పొడిగించి ఉంటే బాగుండునని అనిపిస్తుంది. మరీ ముఖ్యంగా చిన్నమ్మి, ఆనందుడి మధ్య గల ప్రణయ ఘట్టాలను, చిన్నమ్మి లింగాలోడి మధ్య గల అనుబంధాన్ని మరింత విపులంగా వర్ణించగల అవకాశం ఉన్నా రచయిత ఆ పనికి పూనుకోలేదు. బహుశా ఆ కారణంగానేమో కథ మరింత చిక్కగా, చక్కగా తయారైంది. స్త్రీ ప్రధాన పాత్రగా వచ్చిన కేశవ రెడ్డి నవల మునెమ్మలో నాయిక ఎంత బలమైనదో, మేఘనాథ రెడ్డి రాసిన పాయి దరువులో నాయిక చిన్నమ్మి కూడా అంతే బలమైనది.

తెలుగు సాహిత్యంలో నాణ్యమైన యువ రచయితలు లేరేమోనన్న దిగులు అవసరం లేదు. ఇప్పుడిప్పుడే యువకులు తమ కలాలను చేత పట్టుకుంటున్నారు. సాహిత్యం అనే కళకు తమదైన రంగులు వేస్తున్నారు. ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను పెంచుకుంటూ మేలిమి కథలను తయారు చేస్తున్నారు. ఆ కోవలోని రచయితలలో మేఘనాథ్ రెడ్డి మొదటి వరుసలో నిలబడతాడు. మున్ముందు అతను మరిన్ని గొప్ప రచనలు చేయాలని, తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేయాలని కోరుకుందాం. రూ.120 వెల ఉన్న పాయి దరువులు నవల కాపీ కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 63003 18230.

– పేట యుగంధర్
94925 71731

సత్యహరిశ్చంద్ర నాటక సత్యాలు



డా. జోస్యుల కష్ణబాబుగారి సిద్ధాంత వ్యాసం ఇది. సాహిత్యం మీద వల్లమాలిన మక్కువతో ఏదో చెయ్యాలన్న తపనతో ఒక జిజ్ఞాసువు ప్రారంభించిన పని. ఎత్తిపోతల పథకాల వాళ్ళ వల్ల కొంత పరువు కోల్పోయింది కానీ పిహెచ్.డి.కోసం చేసే పరిశోధన అంత తేలిక పని కాదు. ఎంతో అన్వేషణ, మరెంతో తవ్వకం, చాలా నైపుణ్యం, శ్రద్ధా గట్రా అవసరమవుతాయి.

పరిశోధన ఒక భవనం లాంటిది, కష్టపడి కట్టుకు రావాలి. చిత్రమేమిటంటే కట్టుబడి పూర్తయ్యాక ఉండదు కానీ తయారయ్యే పర్యంతం పరిశోధకుడు యావచ్ఛక్తీ వెచ్చించి దాని భారాన్ని మోస్తూనే ఉంటాడు. కాబట్టి తీసుకునే పరిశోధనాంశానికి ఏదో ఒకరకమైన ప్రాధాన్యం ఉండాలి. లేకపోతే అవన్నీ నిరర్థకాలయిపోతాయి.

కృష్ణబాబు గారి ఈ పరిశోధనకు ఏవిధమైన ప్రాధాన్యం ఉందో చూద్దాం. ఒకప్పుడు తెలుగువాళ్ళ వినోదకాలాన్ని ఆక్రమించిన కళల్లో నాటకానిది పెద్దపీట. అతి ప్రముఖంగా తెలుగు రంగస్థలాన్ని ఏలిన నాటకాల్లో హరిశ్చంద్ర నాటకం ఒకటి. దానితో సమస్థాయివిగా పేర్కొనదగ్గ నాటకాలు బహుశా గయోపాఖ్యానం, తిరుపతి కవుల పాండవ నాటకాలు మాత్రమేనేమో!

గురజాడ అప్పారావు గారు ఒకచోట హరిశ్చంద్ర నాటకాన్ని ప్రస్తావిస్తూ 'హరిశ్చంద్ర కథ దాన్ని కల్పించిన నాటి జాతి హృదయానికి ప్రతిబింబం' అన్నారు. సత్యాచరణ, సత్యవాక్కు జాతి నిర్దేశించుకున్న నైతిక విలువలని ఆయన ఆంతర్యం. ఇది ఉపరితల దృష్టి కాదు. సాహిత్యపు మూలాలను తవ్వి చూసే చూపు. జాతి తన స్వభావాన్ని ఆవిష్కరించే సాహిత్యాన్నే తలదాలుస్తుందని, కాలానికి నిలిచే రచనల లోతు మనం జాగ్రత్తగా ఆలోచించి నిర్ధారించుకోవలసి ఉందని ఈ వాక్యం సూచిస్తుంది.

సమీక్ష

కవులు కథను మార్చి రాసెయ్యడం, ప్రజలు దాన్నే అసలుగా భావించి ఆదరించడం ఆశ్చర్యం. అబద్ధాల హరిశ్చంద్రుడు సత్య హరిశ్చంద్రుడయిపోయాడు రచయితల చేతిలో. ఈ వెసులుబాటు పౌరాణిక ఇతివృత్తాలకు మాత్రమే ఉంటుంది. ప్రజలు పురాణాలను నెత్తిమీద పెట్టుకుని చూసుకుంటారు.

హరిశ్చంద్రుడు వేద హరిశ్చంద్రుడిగానే ఉండిపోయినట్టయితే ఎప్పుడో రూపుమాసి పోయి ఉండేవాడు. సత్యహరిశ్చంద్రుడవడం వల్లనే నిలిచాడు. ప్రజలకు ధీరశాంతుడంటే వల్లమాలిన ఇష్టం అని, కరుణ రసప్రధానాలైన రచనలు వాళ్ళని బాగా ఆకట్టుకుంటాయని అర్థం. ఇది హరిశ్చంద్రుడి కథకీ, తెలుగుజాతి హృదయానికీ మధ్య ఉన్న లంకె. అంతగా జనాదరణ పాత్రమైన ఆ నాటకాన్ని తన పరిశోధనకు విషయంగా ఎన్నుకున్నారు కృష్ణబాబు గారు.

పరిశోధనాంశానికీ, పరిశోధకుడికీ మధ్య ఆనుకూల్యం అవసరం. అది లోపిస్తే పరిశోధన అమనస్కంగా సాగుతుంది. కృష్ణబాబు గారు తనకి నచ్చిన అంశాన్నే స్వీకరించారు. ఆయన సాత్త్వికులు. కరుణ రసాస్వాదనకు ఉన్ముఖంగా ఉండే మనస్సు ఆయనది. పద్య ప్రియులు. సాంప్రదాయిక వస్తువిశేషాల మీద సతార్కికమైన గౌరవం ఉన్న వ్యక్తి. అందుచేత హరిశ్చంద్ర నాటకం ఆయనను బాగా ఆకర్షించి ఉంటుంది.

ఆ నాటకం ఎందుకిన్ని ప్రదర్శనలకు నోచుకుంది? అందులో జాతిమమైకం కావడానికి మూలమైన విషయం ఏమిటి? ఎందుకిందరు రచయితలు దాని మీద మక్కువ పడ్డారు? ఏ ఇతర ఇతివృత్తమూ ఇందరు రచయితలకు గ్రహణయోగ్యం కాలేదెందుకు? ఇవి ఆలోచనీయాంశాలే. వీటిని ఆలోచించి సవిస్తరంగా ఈ వ్యాసాన్ని రూపొందించారు కృష్ణబాబు గారు. ఈ పరి శోధనలో ప్రత్యేకంగా ప్రశంసించదగ్గ విషయాలు కొన్ని ఉన్నాయి.

1. సేకరణ : రామకథ తర్వాత ఇన్ని ప్రక్రియల్లో వచ్చిన ఇతివృత్తం హరిశ్చంద్ర కథేనన్నారు కృష్ణబాబు. 50కి పైగా నాటక రచనలున్నాయని తేల్చారు. తెలుగులో ఇన్ని హరిశ్చంద్ర నాటకాలున్నాయని కృష్ణబాబు గారు సేకరించి చూపించేదాకా చాలామందికి తెలియదు. అవి సంఖ్యలో తక్కువగా ఏమీ లేవు. చాలా కష్టపడి అముద్రిత నాటకాలను కూడా సంపాదించారు. పుస్తకాల కోసం అనేక గ్రంథాయాలను సందర్శించారు. రాజమండ్రి గౌతమీ గ్రంథాలయం, కాకినాడ ఆంధ్ర సారస్వత పరిషత్తు గ్రంథాలయం, వేటపాలెం సారస్వత నికేతనం చూసారు. మద్రాసు కన్నె మరా లైబ్రరీ, ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీల పుస్తకాలను కూడా తిరగేసారు. తనకు ముందు ఈ అంశంమీద కృషి చేసిన ప్రముఖుల్ని కూడా కలుసుకుని విషయ సేకరణ చెయ్యడం, అనుమాన నివృత్తి చేసుకోవడం, మరో విశేషం. తెలుగు నాటకరంగం అనగానే గుర్తుకు వచ్చే పరిశోధకుడు పి.ఎస్.ఆర్. అప్పారావు గారు. ఆయనను కలిసి మాట్లాడారు. అలాగే మద్రాసు వెళ్ళి, తెలుగులో హరిశ్చంద్రోపాఖ్యానాల మీద పరిశోధన చేసిన వాసా ప్రభావతి గారిని సంప్రదించారు. నాటకాల విషయంలో పరిశోధకులకు కూడా తెలియని విషయాలు కొన్ని నటులకు, నటశిక్షకులకు తెలుస్తాయి. కృష్ణబాబు గారు ఒక నటుడిని ఇంటర్వ్యూ చేసి రాబట్టిన విషయాల్ని అనుబంధంలో ఇచ్చారు. హరిశ్చంద్ర నాటకం ప్రధానంగా పద్యనాటకం కావడం చేత నటులకు పద్యాల్లో తర్ఫీదునిచ్చే హార్మోనిస్టులకి కొన్ని అరుదైన విషయాలు తెలిసే అవకాశం ఉంది. కాబట్టి ప్రసిద్ధ హార్మోనిస్టు గుడిమెట్ల గంగరాజు గారిని కూడా కలిసి విషయ సేకరణ చేసారు. అంతవరకూ ఎవరికీ తెలియని నాటకం 'ముఖ పత్రాదులు లేని నాటకం' ఆయనవల్ల దొరికిందట. ఇవన్నీ కృష్ణబాబు గారి శ్రద్ధకి సూచికలు. అందువల్ల సేకరణ విషయంలో ఆయనకి నూటికి నూరుశాతం మార్కులు.

2. విశ్లేషణ : సాధారణంగా పరిశోధకులు తాము విశ్లేషిస్తున్న రచనల్లోని లోపాలను ప్రస్తావించరు. ఆ పనిచెయ్యరు సరిగదా అర్హతకు మించి ప్రశంసలు కుమ్మరిస్తారు. కృష్ణబాబు గారు ఆ పాపాలకి పాల్పడలేదు. ఒక నాటకం రసహీనంగా ఉందని చెప్పడానికిగాని, ఫలానా కల్పన వల్ల ఒనగూడిన ప్రయోజనం ఏమీ లేదని వివరించడానికిగాని, కొండొకచో 'ఈ కవిగారి పాండిత్యం, శబ్దాలంకార ప్రియత్వం, అనౌచిత్యం ఈ మూడూ ఈ పద్యంలో పోటీ పడ్డాయి.' అనడానికి గాని సంకోచించలేదు. తెలుగు పరిశోధనలలో విమర్శ పాలు చాలా హెచ్చుగా ఉంటోంది. కానీ విమర్శ పేరుతో అతి ప్రశంసమాత్రమే ప్రత్యక్షమౌతోంది. విమర్శ అన్నప్పుడు గుణదోష విచారణలు రెండూ ఉండాలని ఈ పరిశోధకుడికి తెలుసు. ఏయే నాటకాలు బాగున్నాయో ఏవి తేలిపోయాయో స్పష్టంగా చెప్పారు. ఎవరెవరి చేతుల్లో హరిశ్చంద్ర నాటకం ఏయే మార్పులకు గురయిందో వివరంగా తెలియచేసారు.

3. శైలి : పరిశోధన గ్రంథాల శైలిలో పఠనసుఖం ఉండదు. (ఇటీవలివి కావు. ఒక 30 ఏళ్ళ క్రితం గ్రంథాల సంగతి.) పాండిత్య క్లిష్టత ఒకటి అడ్డుతగులుతూ ఉంటుంది. ఈ సిద్ధాంత వ్యాసం 1995 నాటిదే అయినా ఇందులో ఆ ఇబ్బంది లేదు. చాలా సరళంగా విషయ ప్రధానంగా సాగింది రచన. ఇందుకు రచయితను మెచ్చుకోవాల్సిందే.

4. స్వీయ అనుదానం : ఎత్తి రాయడమే పరిశోధన అని ఎగతాళికి గురవుతున్న రోజుల్లో స్వీయ అనుదానం స్వీయాభిప్రాయం ఉన్న రచనలు ప్రశంసార్హాలు. ఈ రచనలోంచి కొన్ని ఉదాహరణలు చెబుతాను.

వేద హరిశ్చంద్ర కథలోనూ పురాణ హరిశ్చంద్ర కథలోనూ చాలా భేదం కనిపిస్తుంది. అది చాలామందికి తెలిసిన విషయమే. అవి ఒకదానినుంచి ఒకటి పరిణామం చెందిన రీతి మాత్రం తెలియదు. ఆ రెండు కథలకూ ముడివేసింది దేవీ భాగవతం అని తేల్చి చెప్పారు కృష్ణబాబు. 1889లోనే పాత్రోచితభాషతో కూడిన హరిశ్చంద్ర నాటకం వచ్చిందని గమనింపచేసారు.

"నృత్యరూపకాలు సాహిత్య దృష్టితో చూస్తే గొప్పగా అనిపించవు గాని ప్రదర్శన దృష్టితో చూస్తే ఇవే ప్రజాహృదయాన్ని బాగా కదిలిస్తాయి." (పుట–311) అని వ్యాఖ్య ఒకటి చేసారు. ఇది చాలా మంచి గమనింపు. దృశ్య రూపం ఎదలోతులకు దిగిన రీతిలో అక్షరరూపం దిగదు. యక్షగాన రచనల వంటి హరిశ్చంద్ర రూపకాలకు కూడా తన పరిశోధనలో భాగం కల్పించడం ఒక విశేషం.

5. నిష్పక్షపాత వైఖరి : కృష్ణబాబు గారి గ్రంథంలో మరొక విశేషం పురాణవైర రచనల్ని కూడా సమానంగా ఆదరించడం. చలం, నార్ల రాసిన హరిశ్చంద్ర నాటకాలను పరిశీలించినప్పుడు తన వైముఖ్యం గాని, ఆనుకూల్యం గాని ఆ పరిశీలనల్ని ప్రభావితం చెయ్యకుండా రాయడాన్ని గమనించవచ్చు. ఈ మాట ప్రత్యేకంగా ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే పక్షపాత వైఖరిని తప్పించుకోవడం చాలా కష్టం. ఉదాహరణకు నవలా సాహిత్యం మీద పరిశోధన చేసిన బి.వి. కుటుంబ రావు గారు ఎంతో శ్రమకోర్చి వందలాది నవలల్ని విశ్లేషించి పెద్ద సిద్ధాంత గ్రంథాన్ని తయారుచేసారు కానీ చలం వంటి కొందరు రచయితల నవలల్ని గురించి రాసినప్పుడు నిష్పాక్షికతను పాటించలేకపోయారు.

పాఠకులు ఈ గ్రంథాన్ని ఆదరించడానికి ఈ సుగుణాలు చాలవా? ఇప్పటికయినా తన పరిశోధక శ్రమను అచ్చులోపోసి ప్రకటిస్తున్నందుకు మిత్రులు కృష్ణబాబు గారికి అభినందనలు. ఈ పుస్తకంలో నాకు కూడా ఇలా ఒక పాత్ర కల్పించినందుకు ధన్యవాదాలు.

– రెంటాల శ్రీవెంకటేశ్వరరావు
విశ్రాంత ప్రిన్సిపాల్
7799111456

యు అంటే యూటర్న్ !

- మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ సెటైర్లు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ఏకీకృత పెన్షన్ పథకాన్ని (యుపిఎస్) ప్రకటించిన మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ సెటైర్లు వేసింది. యుపిఎస్‌లో యూ అంటే మోడీ ప్రభుత్వ యూటర్న్‌కు సంకేతమని వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం ప్రభుత్వంపై విమర్శలు సంధిస్తూ జూన్ 4వ తేదీ తర్వాత ప్రధాని దురహంకార శక్తిపై ప్రజాశక్తి పైచేయి సాధించిందని చెప్పారు. లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై బడ్జెట్‌లో వెనక్కి తగ్గడం, వక్ఫ్ బిల్లును జెపిసికి పంపడం, లేటరల్ ఎంట్రీ నియామకాల ప్రకటనను రద్దు చేయడం... ఇవన్నీ ప్రజాశక్తికి నిదర్శనాలని తెలిపారు. ఈ నిరంకుశ పాలన నుండి 140 కోట్ల ప్రజలను కాపాడడం, ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించేలా చేయడం తమ కర్తవ్యమని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఖర్గే పోస్ట్ చేశారు. నూతన పెన్షన్ పథకం 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ప్రయోజనం చేకూరుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇందులో చేరితే ఆ సంఖ్య 90 లక్షలకు చేరుతుందని ఆయన తెలిపారు.

రెండుగా విడిపోయిన రైలు..

తప్పిన పెను ప్రమాదం..!

రాయ్‌పూర్ : తరచూ జరుగుతున్న రైలు ప్రమాదాలు ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. రన్నింగ్‌లో ఉన్న రైలు రెండుగా విడిపోయిన ఘటన ఉత్తర ప్రదేశ్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఫిరోజ్‌పూర్ నుంచి ధన్‌బాద్ వెళ్తున్న కిసాన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం తెల్లవారుజామున 3.36 గంటల ప్రాంతంలో రైలు ధాంపూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. 3.45 గంటలకు సర్కడ చక్రజామల్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన అనంతరం రాయ్‌పూర్ రైల్వేగేట్ సమీపానికి రాగానే రైలు రెండుభాగాలు విడిపోయింది. మొత్తం 21 కోచ్‌లకు గాను ఎనిమిది కోచ్‌లు విడిపోగా.. మిగతా రైలు సియోహరా స్టేషన్‌కు చేరగా.. రాయ్‌పూర్ సమీపంలో ఎనిమిది కోచ్‌లు నిలిచిపోయాయి. ఈ ఘటనపై గార్డ్ సమాచారం అందించడంతో అధికారులు షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత ఎస్‌పి ధరమ్ సింగ్, పోలీస్ సర్కిల్ సర్వం కుమార్, కొత్వాల్ కిషన్ అవరాత్ బలగాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం కోచ్‌లను రైలుకు అనుసంధానించారు. రైలులో ఉన్న ప్రయాణికుల్లో ఎక్కువగా పోలీస్ ఎగ్జామ్‌కు హాజరయ్యే అభ్యర్థులే ఉన్నారు. ఈ ఘటన అనంతరం రైల్వేగేట్ వద్ద అధికారులు బస్‌లను ఆపి.. అభ్యర్థులను గమ్యస్థానాలకు పంపారు. ఈ రైలు ఘటనతో పలు రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ధాంపూర్ రైల్వే స్టేషన్‌లో పంజాబ్ మెయిల్ దాదాపు 2 గంటల పాటు నిలిచిపోయింది. ధాంపూర్‌లో స్టాపే లేని జననాయక్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్లపై తీవ్ర ప్రభావంపడింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. అదే మార్గంలో మరో రైలు వచ్చి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదోనని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

'చిత్రపరిశ్రమ'లో ఆరోపణలపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు

- కేరళ సిఎం విజయన్

తిరువనంతపురం : మలయాళ చిత్రసీమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై తీవ్ర చర్చ నడుస్తోంది. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఏడుగురు పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు కేరళ సిఎం పినరయి విజయన్ ప్రకటించారు. పోలీసు అధికారులతో ఆదివారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. తాజాగా వస్తోన్న ఫిర్యాదులు, ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఐజి స్పర్జన్ కుమార్ నాయకత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కమిటీలో డిఐజి ఎస్ అజి

ధారవి అభివృద్ధి హుళక్కేనా?

- భూసేకరణలో అదానీకి సవాళ్లు
- 580 ఎకరాల కోసం ఆపసోపాలు



ముంబయి : ఆసియాలో అతి పెద్ద మురికివాడల్లో ఒకటైన ముంబయిలోని ధారవి ప్రాంతంలో ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించడం కోసం అవసరమైన భూమిని సేకరించేందుకు గౌతమ్ అదానీ నేతృత్వంలోని జాయింట్ వెంచర్ కంపెనీ ఆపసోపాలు పడుతోంది. ధారవి మురికివాడ న్యూయార్క్ సెంట్రల్ పార్కు పరిమాణంలో మూడు వంతులు ఉంటుంది. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యల కారణంగా ధారవి రీడెవలప్‌మెంట్ ప్రణాళిక ఇబ్బందుల్లో పడింది. ధారవి మురికివాడ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉంది. భారత్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందంటూ పాలకులు పలుకుతున్న ప్రగల్భాలను అది అపహాస్యం చేస్తూ కన్పిస్తుంది. ధారవి ప్రాంతంలో 594 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న మురికివాడను ఆధునిక సిటీ హబ్‌గా మార్చేందుకు అదానీ గ్రూపు గత సంవత్సరం 619 మిలియన్ డాలర్ల బిడ్‌ను సొంతం చేసుకుంది. అదానీ గ్రూపునకు ఆది నుండీ సమస్యలే ఎదురవుతున్నాయి. కాంట్రాక్టును దక్కించుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి అదానీ గ్రూపునకు అవాంఛిత లబ్ధి చేకూరిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. ఇప్పుడు తాజాగా ఆ గ్రూపు సరికొత్త సవాళ్లు ఎదుర్కొంటోంది. ధారవి ప్రాంతంలో 2000వ సంవత్సరానికి ముందు నివసించిన వారికి అభివృద్ధి చేసిన భూమిలో ఉచితంగా ఆవాసాలు నిర్మించి ఇవ్వాల్సి ఉంటుంది. ఇళ్లు కోల్పోయిన సుమారు ఏడు లక్షల మందికి గృహాల నిర్మాణం కోసం 580 ఎకరాలు అవసరమవుతాయి. వీరికి ఇంటి నిర్మాణం కోసం అదానీ గ్రూపు చేస్తున్న ప్రయత్నాలు ఇంకా కొలిక్కి రాలేదు. తమ వద్ద అవసరమైన భూమి ఉన్నప్పటికీ అదానీ గ్రూపుతో చేయి కలిపేందుకు ప్రభుత్వ సంస్థలు సుముఖత చూపడం లేదు. ముంబయిలో ఒక్క అంగుళం స్థలం దొరకడం కూడా గగనమేనని ధారవి రీడెవలప్‌మెంట్ అథారిటీ అధిపతి ఎస్‌విఆర్ శ్రీనివాస్ చెప్పారు. భూమి లభించనిదే ప్రాజెక్టు ముందుకు సాగడం అసంభవమని ఆయన అన్నారు. పది లక్షల మందికి గృహనిర్మాణం చేపట్టాలని ఈ ప్రాజెక్ట్ నిర్దేశించుకుంది. అయితే అది అంత సులభంగా కన్పించడం లేదు. మార్చిలో ప్రాజెక్ట్ తన సర్వేను మొదలు పెట్టింది. ఏడు సంవత్సరాలలో నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలోని అత్యంత ఖరీదైన రియల్ ఎస్టేట్ మార్కెట్లలో ముంబయి ఒకటి. అక్కడ రియల్ ఎస్టేట్ ధరలు ఆకాశాన్ని తాకుతుంటాయి. భూమి దొరకడం చాలా కష్టంగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ధారవిని తిరిగి అభివృద్ధి చేయడం పెను సవాళ్లతో కూడుకున్న పని అని అదానీ గ్రూప్ అంగీకరిస్తోంది. అయినప్పటికీ ఆ ప్రాంతంలో భవిష్యత్తులో కోటీశ్వరులు నివసిస్తారని బీరాలు పలుకుతోంది.



కేరళ సిఎం విజయన్‌కు చెక్కును అందజేస్తున్న ఐద్వా నాయకులు

వయనాడ్ బాధితులకు రూ.23 లక్షల చెక్కు అందజేత

తిరువనంతపురం : వయనాడ్ బాధితులకు సహాయక చర్యల కోసం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కేరళ రాష్ట్ర కమిటీ రూ.23 లక్షల విరాళాల చెక్కును ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఆదివారం అందజేసింది. అంతకుముందు బాధితులకు సహాయం, సహాయక చర్యల కోసం ఐద్వా రూ.35 లక్షల విరాళాలను అందించింది.

స్వతంత్ర అభ్యర్థులుగా జమాతే నేతలు

- స్వాగతించిన ఒమర్, మెహబూబా

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని నిషిద్ధ జమాతే ఇస్లామీ నేతలు తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ ఆదివారం స్వాగతించారు. 'ఇది ప్రజాస్వామ్య పరిపక్వత. ఎన్నికల్లో పోటీ చేసే స్వేచ్ఛ అందరికీ ఉంటుంది. తమ సంస్థపై నిషేధాన్ని ఎత్తివేయాలని జమాతే ఇస్లామీ నేతలు డిమాండ్ చేస్తున్నప్పటికీ స్వతంత్రులుగా పోటీ చేయాలని నిర్ణయించుకోవడం స్వాగతించదగిన పరిణామం' అని నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ తెలిపారు. ఆర్టికల్ 370 రద్దుకు ముందు, పుల్వామాలో ఆత్మాహుతి దాడి జరిగిన తర్వాత జమాతే ఇస్లామీ సంస్థను చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2019లో నిషేధించింది. జమాత్ నేతల నిర్ణయాన్ని ప్రధాన స్రవంతి పార్టీలన్నీ సమర్థించాయి. పార్టీ తరపున, పార్టీ గుర్తుతో పోటీ చేయడం సాధ్యం కాకపోయినప్పటికీ స్వతంత్రులుగా పోటీ చేయవచ్చునని, మ్యానిఫెస్టోతో ముందుకు వస్తే ప్రజలే నిర్ణయం తీసుకుంటారని ఒమర్ చెప్పారు. ఇది మంచి నిర్ణయమని పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ వ్యాఖ్యానించారు. మత సంస్థలు మసీదులపై దాడి చేసినప్పుడు, గోరక్షణ పేరిట ముస్లిములను హత్య చేసినప్పుడు వాటిని స్వేచ్ఛగా వదిలేసి జమాత్ వంటి మంచి సంస్థలను నిషేధించారని ఆమె అన్నారు.

కాల్పుల విరమణపై ఈజిప్టులో మళ్లీ చర్చలు

- ఆగని ఇజ్రాయిల్ దురాగతాలు
- తాజా దాడుల్లో 50 మంది మృతి



కైరో/గాజా: ఒక వైపు అమెరికా, ఈజిప్టు మధ్యవర్తిత్వంలో కైరోలో కాల్పుల విరమణ చర్చలు పునరుద్ధరణ జరుగుతుండగా, మరో వైపు ఇజ్రాయిల్ గాజాపై క్రూరమైన దాడులు కొనసాగిస్తోంది. ఇంకోవైపు గాజాకు మానవతా సాయం అందకుండా చేయడం వల్ల గాజాలో పిల్లల పరిస్థితి మరీ దారుణంగా తయారవుతోందని, పోషకాహార లోపంతో చిన్నారులు పెద్దయెత్తున పోలియో బారిన పడే ప్రమాదముందని ఐరాస హెచ్చరించింది. అయినా ఇజ్రాయిల్ మిలిటరీ రక్తదాహం తీరలేదు. శనివారం గాజాపై జరిపిన భయానక దాడుల్లో 50 మంది దాకా చనిపోయినట్లు పాలస్తీనియన్ ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. రోడ్లపై వెళ్తున్నవారి మీద కూడా బాంబులు వేస్తుండడంతో ప్రజల పరిస్థితి దారుణంగా తయారైంది. కాల్పుల విరమణ ఒప్పంద చర్చల పేరుతో హమాస్‌ను నూట్రల్‌లో ఉంచి ఇజ్రాయిల్‌ను మరింత బలోపేతం చేయడమే అమెరికా, ఇతర పశ్చిమ దేశాల ఎత్తుగడగా ఉందని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదిలా వుండగా అమెరికా, ఈజిప్టు అధ్యక్షులు బైడెన్, శిశి ఆదివారం ఫోన్‌లో సంభాషించుకున్నారు. కాల్పుల విరమణ తరువాత కూడా గాజాలో తమ సైనిక బలగాలు ఉండేందుకు అంగీకరించాలని ఇజ్రాయిల్ చేస్తున్న డిమాండ్‌ను హమాస్, ఇతర పాలస్తీనా గ్రూపులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.కాల్పుల విరమణ ఒప్పందం ముందుకు సాగకపోవడానికి ఇజ్రాయిల్ అనుసరిస్తున్న ఈ వైఖరే కారణం.

ఉత్తరాఖండ్, త్రిపుర, గుజరాత్‌లలో భారీ వర్షాలు

న్యూఢిల్లీ : భారీ వర్షాల కారణంగా ఉత్తరాఖండ్‌లోని . కొండచరియలు విరిగిపడటంతో నలుగురు నేపాలీ కార్మికులు మరణించారు. హరిద్వార్‌లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓ వ్యక్తి గంగా నదిలో కొట్టుకుపోయాడు. చమోలి-నందప్రయాగ మధ్య బద్రీనాథ్ జాతీయ రహదారిపై రాకపోకలు రెండో రోజు కూడా నిలిచిపోయాయి. రోడ్డు మూసుకుపోవడంతో కేదార్‌నాథ్ ఆలయానికి వెళ్లే ప్రయాణం నిలిచిపోయింది.


ఉత్తర గుజరాత్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బనస్కాంత జిల్లాలో ఇరవై నాలుగు గంటల్లో 112 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వివిధ ప్రాంతాల్లో రోడ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

త్రిపురలో సిపిఎం కార్యకర్తల సహాయక చర్యలు

త్రిపురలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం వరద బాధితులను రక్షించే క్రమంలో ఇద్దరు రెస్క్యూ వర్కర్లు ప్రాణాలు కోల్పోయారు. బాధిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సిపిఎం కార్యకర్తలు రాష్ట్రంలో విస్తృతంగా సహాయక చర్యలు చేపడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి సహా పార్టీ నాయకులు, కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. పలువురు యువ కార్యకర్తలు వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలకు వెళ్లి, ఆహారం, తాగునీరు, మందులు అందజేశారు. బాధితులను పరిస్థితి అడిగి తెలుసుకుంటున్నారు.



త్రిపురలోని ముంపు ప్రాంతంలో సహాయక చర్యలు చేపడుతున్న సిపిఎం కార్యకర్తలు



ప్రసూతి మరణాలను అరికట్టడంలో అమెరికా కంటే ముందున్న కేరళ

- దేశంలో నాలుగో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- యెమెన్ కంటే దారుణంగా అస్సాం

న్యూఢిల్లీ : ప్రసూతి మరణాలను అరికట్టడంలో అమెరికా కంటే కేరళ ముందుంది. మరోవైపు, అస్సాం యుద్ధంలో దెబ్బతిన్న యెమెన్ కంటే వెనుకబడి ఉంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం... 2018-2020లో గర్భధారణ సమయంలో మాతాశిశు మరణాలను నివారించడంలో భారతదేశంలో ముందున్న తొలి ఐదు రాష్ట్రాలు కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ , ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ఉన్నాయి. ఐదు అత్యంత వెనుకబడిన రాష్ట్రాలలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ , మధ్యప్రదేశ్, అస్సాం ఉన్నాయి. వీటిలో ఒడిశాలో ఇటీవల బిజెపి అధికారంలోకి రాగా, మిగిలిన నాలుగు రాష్ట్రాలు చాలాకాలంగా బిజెపి ఏలుబడిలోనే ఉన్నాయి. ఐరాస నివేదిక ప్రకారం , కేరళలో ప్రతి లక్ష జననాలకు 19 మంది, మహారాష్ట్రలో 33 మంది, తెలంగాణలో 43 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 45 మంది, తమిళనాడులో 54 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అత్యంత అధ్వానంగా ఉన్న రాష్ట్రాల్లో అస్సాంలో 195 మంది, మధ్య ప్రదేశ్‌లో 173 మంది, ఉత్తర ప్రదేశ్‌లో 167 మంది, చత్తీస్‌గఢ్‌లో 137 మంది, ఒడిశాలో 119 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 2018-20లో భారతదేశ సగటు 97. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం , 2020లోనే ప్రపంచవ్యాప్తంగా 300,000 మంది గర్భిణులు ప్రసవ సమయంలో ప్రాణాలు కోల్పోయారు. ఇందులో అమెరికా వంటి దేశాలు కూడా ఉన్నాయి , ఇక్కడ ఈ రేటు ఇటీవలి కాలంలో పెరుగుతోంది. ఐక్యరాజ్యసమితి ఆరోగ్య సంస్థ ' హూ ' ప్రకారం ప్రపంచంలోని ప్రతి 2 నిమిషాలకు ఒక మహిళ ప్రసవ సమయంలో తన ప్రాణాలను కోల్పోతోంది

మహిళలపై నేరాలకు కఠిన శిక్షలు

- చట్టాలను మరింత పటిష్టపరుస్తాం
- ప్రధాని నరేంద్రమోడీ



ముంబయి : మహిళలపై నేరాలకు కఠినమైన శిక్షలు విధించేలా చట్టాలను మరింత పటిష్టపరుస్తామని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఆదివారం ఉత్తర మహారాష్ట్రలోని జల్గావ్‌లో నిర్వహించిన లఖ్‌పతి దీదీ ర్యాలీలో ప్రధాని మాట్లాడారు. మహిళల కోసం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి గత ప్రభుత్వాలు చేసిన దానికంటే గత పదేళ్లలో తమ ప్రభుత్వం ఎక్కువ చేసిందని మోడీ అన్నారు. 2014 వరకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.25,000 కోట్ల కన్నా తక్కువ రుణాలు ఇచ్చారని, గత పదేళ్లలో తమ ప్రభుత్వం రూ. 9 లక్షల కోట్ల సహాయం అందించిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ 2,500 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను విడుదల చేశారు. ఈ నిధులతో 4.3 లక్షల స్వయం సహాయక సంఘాలలోని 48 లక్షల మంది సభ్యులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. లఖ్‌పతి దీదీ పథకం మహిళలకు ఆదాయాన్ని పెంపొందించడమే కాదు, భవిష్యత్ తరాలకు సాధికారత కల్పిస్తోందని అన్నారు. భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని, దానిలో స్త్రీలది పెద్ద పాత్ర అని అన్నారు. రెండేళ్ల క్రితం పరిస్థితి ఈ విధంగా లేదని అన్నారు.

90 శాతం ప్రజలకు ప్రయోజనకరం

- కులగణనపై రాహుల్
- రాజ్యాంగ రక్షణకు అది అవసరం

లక్నో : రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కులగణన చేపట్టాల్సిన అవసరం ఉన్నదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. కులగణన తన లక్ష్యమని, అందుకోసం రాజకీయ మూల్యాన్ని చెల్లించేందుకు సైతం సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో శనివారం జరిగిన 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్'లో ఆయన ప్రసంగిస్తూ కులగణన ద్వారా దేశ జనాభాలో 90 శాతం మందికి దక్కాల్సిన ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. జనాభాలో అత్యధికులు ఈ ప్రయోజనాలు పొందలేకపోతే రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, కాపాడడం సాధ్యం కాదని చెప్పారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 సంవత్సరాలు అయినప్పటికీ దేశ జనాభాలో 90 శాతం మంది అట్టడుగునే ఉన్నారని, కార్పొరేట్ ప్రపంచం, మీడియా, న్యాయ వ్యవస్థలో వారి ప్రాతినిధ్యం చాలా స్వల్పంగా ఉండడం లేదా అసలు లేకపోవడం జరుగుతోందని రాహుల్ వివరించారు. కులగణన కాంగ్రెస్‌కు కీలకమైన విధాన నిర్మాణాన్ని అందిస్తుందని ఆయన చెప్పారు. దేశంలో సామాజిక - ఆర్థిక, సంస్థాగత సర్వే చేపట్టాలని తాను కోరుకుంటున్నానని అన్నారు. సంపద కేవలం ఐదు లేక పది శాతం మందికే పంపిణీ కాకూడదని, దానిని ప్రజలందరికీ పంచాలని, అదే తన విజన్ అని తెలిపారు. దళితులు, వెనుకబడిన తరగతులు, ఆదివాసీలకు సమాన భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. అప్పుడే దేశ వ్యవహారాల్లో వారి గొంతుక వినిపిస్తుందని, దాని వనరులపై పెత్తనం వస్తుందని అన్నారు. దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉన్నదని రాహుల్ సూచించారు. వాహనంలోని ఇంజిన్‌లో ఉండే సిలిండర్లను ఆయన ఉదాహరణగా చూపారు. 'ఒక్కటి కాకుండా మొత్తం పది ఇంజిన్లు పనిచేయాలని నేను కోరుకుంటాను' అని వ్యాఖ్యానించారు. రిజర్వేషన్లపై యాభై శాతం పరిమితిని విధించడం తనకు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. జనాభాలో దామాషా, శాతం ఆధారంగా ప్రాతినిధ్యం, భాగస్వామ్యం ఉండాలని అభిప్రాయపడ్డారు. లేటరల్ ఎంట్రీ ద్వారా రిజర్వేషన్లను ఎత్తేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాహుల్ విమర్శించారు.

హర్యానా ఎన్నికలను వాయిదా వేయండి

- వరుస సెలవులతో ఓటింగ్ తగ్గే అవకాశం
- ఇసిని కోరిన బిజెపి
- రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజాగ్రహం కారణంగానే
- వాయిదాకు యత్నాలు?

చండీగఢ్ : హర్యానా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను వాయిదా వేయాలంటూ భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)ను ఆ రాష్ట్ర బిజెపి శాఖ కోరింది. ఈ మేరకు ఇసిఐకి లేఖ రాసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 1న జరగాల్సిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు, తర్వాత వరుస సెలవులు ఉన్నాయనీ, ఈ కారణంతో ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గే అవకాశమున్నదని బిజెపి శాఖ కారణాలుగా చూపించింది. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ కూడా ఎన్నికలను వాయిదా వేయాలని డిమాండ్ చేసింది. 90 అసెంబ్లీ స్థానాలున్న హర్యానా రాష్ట్ర అసెంబ్లీకి అక్టోబర్ 1న ఎన్నికలు జరగనుండగా.. అదే నెల 4న తుది ఫలితాలు వెలువడనున్నాయి. దీనికి సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే తేదీలను ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పంకజ్ అగ్వాల్‌కు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ లాల్ బదోలీ లేఖ రాసినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. దీనిని పంకజ్ అగర్వాల్ కూడా ధ్రువీకరించారు. బిజెపి అభ్యర్థనను ఇసిఐకి పంపినట్టు ఆయన తెలిపారు. ఇసిఐకి బిజెపి అభ్యర్థనపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ నుంచి విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపాలన్న ఆగ్రహం ప్రజల్లో ఉన్నదనీ, ఈ కారణంగానే బిజెపి ఎన్నికలను వాయిదా వేయాలనే ప్రయత్నాలకు దిగుతున్నదని హస్తం పార్టీ ఆరోపించింది.

యువత రాజకీయాల్లోకి వస్తేనే ప్రజాస్వామ్యానికి బలం

- మన్ కీ బాత్‌లో మోడీ

న్యూఢిల్లీ : ఎలాంటి నేపథ్యం లేని లక్ష మంది యువత రాజకీయాల్లోకి రావాలని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇచ్చిన పిలుపునకు విస్తృత స్పందన వచ్చిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఆదివారం ప్రసారమైన 113వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. అభివృద్ధి చెందిన భారత్, బలమైన ప్రజాస్వామ్యం కోసం యువత ప్రజా జీవితంలోకి రావాలని అన్నారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో నేడు వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి యువత రాజకీయాల్లోకి రావాలని అన్నారు. కుటుంబ రాజకీయాలు నూతన ప్రతిభను అణచివేస్తాయని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అంతరిక్ష రంగంలో కృషి చేస్తున్న పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ప్రధాని మాట్లాడారు. చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా స్పేస్ డే నిర్వహించుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాదే తొలి అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకొన్నామని పేర్కొన్నారు. ఈ రంగంలో తీసుకొచ్చిన అనేక సంస్కరణలతో యువత పెద్ద ఎత్తున లబ్ధి పొందినట్లు చెప్పారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ నిలిచిందని గుర్తుచేశారు. అంతరిక్ష రంగం యువతను ఆకర్షిస్తోందని తెలిపారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' ప్రచారం నేపథ్యంలో దాదాపు ఐదు కోట్ల మందికిపైగా జాతీయ జెండాతో ఫొటోలు దిగి వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేశారని అన్నారు.

రెడ్ మీట్‌తో ముప్పు

- మధుమేహం పెరిగే ప్రమాదం
- లాన్సెట్ తాజా అధ్యయనం వెల్లడి

న్యూఢిల్లీ : మాంసాహారులకు ఇది షాకింగ్ న్యూస్. రెడ్ మీట్ (బీఫ్, ల్యాంబ్, మటన్, పోర్క్, వీల్, వెనిసన్, మేక మాంసం) ను తీసుకుంటే డయాబెటిస్ (మధుమేహం) పెరిగే ప్రమాదమున్నదని లాన్సెట్ అధ్యయనం వెల్లడించింది. 19 లక్షల మంది నుంచి అధ్యయనం సమాచారం సేకరించింది. ఇది ది లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైనాలజీలో ప్రచురితమైంది.

లాన్సెట్ తాజా అధ్యయనం ప్రకారం.. దాదాపు 20 దేశాల్లో స్టీక్, బాకన్, సాసేజెస్ వంటి రెడ్ మీట్ తీసుకునే 20 లక్షల మందికి, టైప్ 2 డయాబెటిస్‌కు మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని అధ్యయనం కనుగొన్నది. రోజుకు 50 గ్రాముల ప్రాసెస్డ్ (నిల్వ చేసిన) మాంసం తీసుకునేవారిలో రాబోయే పదేళ్లలో టైప్ 2 డయాబెటిస్ ముప్పు 15 శాతం అధికంగా ఉంటుంది. రోజుకు వంద గ్రాముల ప్రాసెస్ చేయని మాంసం తీసుకునేవారిలో టైప్ 2 డయాబెటిస్ ముప్పు 10 శాతం ఎక్కువగా ఉంటుంది. చికెన్, బాతు వంటి పౌల్ట్రీని రోజుకు వంద గ్రాములుగా తీసుకుంటే 8 శాతం అధిక ముప్పు ఉంటుందని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ పరిశోధకులు కూడా తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఇండియాబి) ప్రకారం.. 2021లో 10.1 కోట్ల మంది భారతీయులు డయాబెటిస్‌ను కలిగి ఉన్నారు. 13.6 కోట్ల మంది ప్రీడయాబెటిస్, 31.5 కోట్ల మంది హైపర్‌టెన్షన్‌ను కలిగి ఉన్నారు.





స్నేహ ఫలం



అనగనగా సింహపురి అనే రాజ్యం ఉంది. ఆ రాజ్యానికి రాజు విక్రమదేవుడు. అతని ముద్దుల కుమారుడు అజేయుడు. ఆ రాజ్యంలో ఒక పెద్ద పాఠశాల ఉన్నది. అందరూ అదే పాఠశాలలో చదివేవారు. అజేయుడు కూడా ఆ పాఠశాలలోనే చదువుకుంటున్నాడు.

అక్కడ పాఠశాలలో పిల్లలందరితో కలిసి ఆడుకునేవాడు. సంతోషంగా గడిపేవాడు. విద్యలన్నింటిని చక్కగా నేర్చుకునేవాడు. అయితే ఒకరోజు అజేయుని తల్లి పాఠశాలకు వచ్చింది. అజేయుడు తన మిత్రులతో కలిసి ఆడుకోవడం చూసి కోపగించింది. 'నీవు రాజపుత్రుడివి. వాళ్లు సామాన్య ప్రజల పిల్లలు. వారితో కలిసి నీవు ఆడుకోకూడదు. వారికి దూరంగా ఉండు' అని చెప్పింది.

మరుసటి రోజు పాఠశాలకు వెళ్లిన అజేయుడు తల్లి చెప్పిన విషయాన్ని పట్టించుకోకుండా అందరితో కలిసి ఆడుకోసాగాడు. పిల్లలందరితో కలిసి ఆడుకున్నాడు. ఈసారి రాజ్య మందిరానికే గురువులను పిలిపించి అజేయుడికి విద్యలను నేర్పించసాగింది అతని తల్లి. అజేయుడు అన్ని విద్యలను చక్కగా నేర్చుకున్నాడు. పెరిగి పెద్దవాడు అయ్యాడు.

ఒకరోజు అజేయుడు వేట కోసం అడవికి వెళ్ళాడు. అక్కడ వేటాడుతుండగా దాహం వేసి, గుర్రం దిగి, కొలను వద్దకు వెళ్ళాడు. అక్కడ పొదల చాటు నుండి ఒక పులి రావడం గమనించాడు. 'చేతిలో బాణం లేదు. ఎలా తప్పించుకోవాలా?' అని ఆలోచిస్తుండగా, అప్పుడే అక్కడికి వచ్చిన వినయుడు, అజేయుడిని కాపాడాడు.

అజేయుడు చాలా సంతోషించాడు. ఆ వినయుడు తన చిన్ననాటి స్నేహితుడే అని తెలుసుకుని అతన్ని తీసుకుని రాజ్యమందిరానికి వెళ్లాడు.


'అమ్మా! వీడు, నేను ఒకే పాఠశాలలో చదువుకున్నాం. ఈ రోజు నన్ను పులి బారి నుండి వీడే రక్షించాడు. ఒకప్పుడు వీడితో ఆడుకుంటుంటూనే నువ్వు నామీద కోప్పడ్డావు. వీడిని కూడా బాగా తిట్టావు. అయినా అవేవీ వీడు మనసులో పెట్టుకోలేదు' అని అని అనగానే ఆ మాటలకు తల్లి వినయుడ్ని దగ్గరకి తీసుకుని ప్రేమగా తల నిమిరింది.



- తాళ్లూరి రేఖశ్రీ,
పదవ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోదాడ,
సూర్యాపేట జిల్లా,
తెలంగాణ.

దారి చూపండి

పిల్లలూ, ఇక్కడ చింటూ, తన కుక్కపిల్ల దగ్గరికి వెళ్లే దారి మర్చిపోయాడు. మీరు చూపించండి.



నేను గీసిన బొమ్మ





ధీరజ్ సాకరే,
7వ తరగతి,
అక్షర శ్రీ హైస్కూల్,
ఆదోని,
కర్నూలు జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రంగస్థలం కోసం ఉద్యోగాన్ని వదిలి ...

నాటకం సమాజం పట్ల బాధ్యత కలిగిన ఒక హామీ. ఇతర వ్యక్తుల బలహీనతలను సొమ్ము చేసుకోదు. బలహీనతలను బలహీనపర్చి గుణాత్మకమైన బలాన్నిస్తుంది. చూసే ప్రేక్షకులు, నటులు, ప్రదర్శింపబడే రంగస్థలం. ఈ మూడు సమాజంలోనివే. కాబట్టి నాటక ప్రయోజనం సమాజానికి వేయి రెట్లు మేలు చేస్తుంది. ఈ ప్రపంచమే ఒక్క నాటకరంగమైతే, అందులో నేను కళాకారుడిని మాత్రమే అంటున్నారు గొప్ప రంగస్థల నటులు, దర్శకుడు, నిర్వాహకుడు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నాటక, నాటిక పోటీలకు గుణనిర్ణేతగా వ్యవహరిస్తున్న దేవిరెడ్డి రామకోటేశ్వరరావు. సకల కళల సమాహారం నాటకరంగంలో మమేకం కావటం ద్వారా సమాజంలోని వివిధ సమస్యలకు పరిష్కారాలకు కూడా చూపెట్టే బాధ్యత నిర్వర్తించటం తనకు ఆనందదాయకమని ఆయన అంటున్నారు. నచ్చిన కళ కోసం స్వచ్ఛంధంగా ఉద్యోగాన్ని విడిచిపెట్టి కళామతల్లి సేవలో ఆయన తరిస్తున్నారు.


గుంటూరు జిల్లా చిలుకలూరిపేట మండలంలోని పురుషోత్తమపట్నం గ్రామానికి చెందిన దేవిరెడ్డి నరసింహారావు, తులసమ్మ దంపతులకు 10 డిసెంబర్, 1954న రామకోటేశ్వరరావు జన్మించారు. చిలకలూరిపేటలోని హయ్యర్ సెకండరీ పాఠశాల నుంచి స్కూల్ విద్యను, సిఆర్ కళాశాల నుంచి బికాం పూర్తిచేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి డిటిఎ (డిప్లమో) పట్టభద్రులయ్యారు. ఆయన భార్య విజయకుమారి, కుమారులు రాఘవేంద్ర, నరేంద్ర. డిగ్రీ పూర్తిచేసిన ఆయన 1978లో బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగంలో చేరారు. ప్రాథమిక విద్యాభ్యాసంలోనే నాటిక ప్రదర్శనలపై ఆసక్తి చూపేవారు. సమీప ప్రాంతాల్లో జరిగే నాటక ప్రదర్శనలకు వెళ్లి తిలకించేవారు. హైస్కూలు దశలో పలు నాటక ప్రదర్శనలను ఇచ్చారు. ఇతర కళాప్రదర్శనలు జరిగే చోట్లకు వెళ్లి అక్కడ కూడా ప్రతిభ చూపేవారు. బ్యాంకు ఉద్యోగం చేస్తూనే నాటిక, నాటక ప్రదర్శనలకు వెళ్లేవారు. ఈక్రమంలో పాత్రలు పెరుగుతుండటంతో పూర్తిగా తన జీవితాన్ని నాటక రంగానికి అంకితం చేయాలను భావించి 1999లో ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.

కళామతల్లి సేవలో...

నటన అంటే ఆయనకు ఎంతో అభిమానం. నాటక ప్రదర్శనలు ఎక్కడ జరిగినా వెళ్లి పాల్గొంటారు. మన రాష్ట్రంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన నాటిక, నాటక పోటీల్లో పాల్గొని, ప్రేక్షకులను అలరించారు. కళలను ప్రోత్సహించేందుకు నాటక సమాజాలు, పరిషత్‌లతో కలిసి పనిచేస్తున్నారు. అభ్యుదయ, పౌరాణిక, సాంఘిక నాటకాలను ప్రోత్సహిస్తూ సమాజంలో పట్టిపీడిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు కృషిచేస్తున్నారు. ఆయన చేసిన కృషికి గాను పలు అవార్డులు, పురస్కారాలు సైతం వరించాయి.

నటించిన నాటకాలు

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న చందంగా మాటలో గాంభీర్యం.. భాషలో మాధుర్యం.. నటనారంగంలో వినూత్న శైలి... ఇటు కళాపోషణలోనూ, ఇటు నాటక సాహిత్యరంగంలోనూ ఆయన ప్రత్యేకతను నిలిపాయి. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన రిణిస్తున్నారు. 1965లో నాటకరంగానికి ఆకర్షితుడై 'పల్లెపడుచు' నాటకంలోని గోపి పాత్రను పోషించారు. తర్వాత 'చివరకు మిగిలేది, పంజా, దారితప్పిన ఆకలి, మనుషులొస్తున్నారు జాగ్రత్త, వందనోటే, నవ్వండి ఇది విషాదం, పూజకు వేళాయెరా వంటి నాటికల్లో నటించారు.



పల్లెపడుచు, తర్జని, గేమ్ నాటకాల్లో ఆయన నటించారు. దర్శకుడిగా కూడా ఆయన మంచి పేరు సంపాదించుకున్నారు. చివరకు మిగిలేది, మనుషులొస్తున్నారు జాగ్రత్త, వందనోటు, గాంధీ పుట్టిన దేశం, వరుడు కావాలి, నవ్వండి! ఇది విషాదం, పూజకు వేళాయెరా! నాటికలకు ఆయన దర్శకత్వం వహించారు.

ఐదు దశాబ్దాలుగా...

1972 నుంచి 1986 వరకూ 'ది అమెచ్యూర్ డ్రమటిక్ అసోసియేషన్ చిలకలూరిపేటకు ఆర్గనైజర్‌గా ఆయన వ్యవహించారు. అదే సందర్భంలో వివిధ పాత్రలు పోషించి, నటనలో ప్రతిభ చూపారు. 1983 నుంచి 1986 వరకూ 'శాస్త్రీయం' గంటూరు (గుంటూరు శాస్త్రి గారు దర్శకుడు, నాయుడుగోపి, వేముల మోహనరావు సహనటులుగా)లో తర్జని, గేమ్ నాటకాల్లో నటించారు. 1970 నుంచి సుమారు 100 పరిషత్తులకు గుణ నిర్ణేతగా, ప్రాథమిక పరిశీలకునిగా అనుభవం ఉంది.



తర్జని నాటకం దూరదర్శన్ హైదరాబాద్ కేంద్రం ద్వారా ప్రసారమైంది. 2014 నుంచి నంది నాటకోత్సవాలకు గుణ నిర్ణేతగా వ్యవహరించారు.

2013 నుంచి 2020 వరకూ పరుచూరి రఘుబాబు నాటక పోటీలకు ప్రాథమిక పరిశీలకునిగా వ్యవహరించారు.

2017 నుంచి 2019,2021 అజో- విభొ-కందాళం పౌండేషన్ వారి నాటిక పోటీలకు ప్రాథమిక పరిశీలకునిగా పనిచేశారు.

2017లో ఆకాశవాణి విజయవాడ కేంద్రం ద్వారా గుణ నిర్ణేతగా వ్యవహరించారు.

చిలకలూరిపేట ఫిలిం సొసైటీ వ్యవస్థాపకుడిగా 1975 నుంచి 1978 వరకూ కార్యదర్శిగా పనిచేశారు. 60 సంవత్సరాలు పూర్తిచేసుకున్న శ్రీ కళానికేతన్ హైదరాబాద్ నిర్వాహక కార్యదర్శిగానూ, 32 సంవత్సరాల రజరంజని హైదరాబాద్‌కు ఉపాధ్యక్షునిగా ఉన్నారు.



భావితరాల కోసం ...

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచం ఎంత ముందుకు వెళ్తున్నా సమాజంలోని రుగ్మతలు మాత్రం పోవటం లేదు. నాడు ఒకలా.. నేడు మరోలా అదే ఒరవడిలో ప్రజా సమస్యలు ఉన్నాయి. నాటక రంగ కళ ద్వారా సమాజంలోని సమస్యలను పట్టిచూపి వాటికి పరిష్కారాలు తెలియజెప్పే ఇతివృత్తంగా నాటిక, నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాం. నా జీవితం కళారంగానికే అంకితం.

- దేవిరెడ్డి రామకోటేశ్వరరావు

అవార్డులు-పురస్కారాలు

2018లో మురళీకృష్ణ కళా నిలయం నిజామాబాద్ వారు 'నాటకమిత్ర బిరుదు' ప్రదానం.

2020లో అజో-విభో-కందాళం ఫౌండేషన్ 'రంగస్థల సేవామూర్తి జీవితకాల సాధన' పురస్కారం

2022లో కీర్తిశేషులు ఆర్.రామారావు స్మారక రంగస్థలి ప్రతిభా పురస్కారం (నరసరావుపేట)

2023 జనవరిలో భోగాపురం పరిషత్తు 'అడపా మాణిక్యం, అచ్చయమ్మల స్మారక జీవిత కాల సాధన పురస్కారం

2023 ఏప్రిల్‌లో కళారంజని నాటక అకాడమీ, భీమవరం 'విశ్వనట చక్రవర్తి ఎస్‌వి రంగారావు పురస్కారం

2023 జులైలో రసరంజని 'గరిమెళ్ల రామమూర్తి రంగ స్థల పురస్కారం

- యడవల్లి శ్రీనివాసరావు

బంగారం లాంటి సినిమా

సమాజాన్ని చైతన్యం వైపు నడిపించే శక్తి, తెగువ కళారంగంలోని కొంతమంది ఔత్సాహికులకే ఉంటుంది. ఒకప్పుడు ఎందరో కళాకారులు ఆ దిశగా పయనించారు కూడా. కానీ ఇప్పుడా ఒరవడి లేదు. ముఖ్యంగా కులం, మతం పేరుతో ఏదేని సామాజిక వర్గానికి కొమ్ము కాస్తూ, చరిత్రను వక్రీకరించే సినిమాలు ఈ మధ్య కాలంలో ఎక్కువగా వస్తున్నాయి. అసలు సినిమా అంటేనే ఆరు ఫైట్లు, నాలుగు పాటలు అన్న చందాన తయారైంది. హీరో ఎలివేషన్లు, హీరోయిన్ కాస్ట్యూమ్స్‌ని ప్రచారం చేసుకుని థియేటర్లకు జనాల్ని రప్పించే పరిస్థితులు కూడా వచ్చాయి. ఇంతటి మూసధోరణితో సాగిపోతున్న సినీ ప్రపంచానికి వేగుచుక్కలా వచ్చాడు డైరెక్టర్ పా. రంజిత్. సినిమా మీద ప్రేమతో ఆయన ఇటువైపు రాలేదు. ఆర్టిస్ట్‌గా రాణించాలని కలలుకన్నాడు. కానీ బాల్యం నుండి తను అనుభవించిన వివక్ష, అవమానాలు నేటికీ తనవారు అనుభవిస్తున్నారని చాటిచెప్పాలంటే సినిమా ఒక్కటే సరైన మాధ్యమని భావించాడు. అనుకున్నదే తడవు తన కలానికి పనిచెప్పాడు. అతను స్పృశించిన ప్రతి చిత్రం ఓ దృశ్యకావ్యం. తాజాగా తెరకెక్కించిన 'తంగలాన్' అందులో ఓ మణిహారం.



డబ్బు కోసమో, పేరు కోసమో పా రంజిత్ సినిమాలని తీయడం లేదు. సమాజంలో వేళ్లూనుకున్న కుల వివక్షపై పోరాటం చేయడమే ధ్యేయంగా తెరకెక్కిస్తున్నాడు. ఆ లక్ష్యం నెరవేరే క్రమంలో అతనికి దక్కిన ఓ పదునైన ఆయుధమే సినిమా. అందుకే ఆయన సినిమాల్లో కథలు మారొచ్చు. నటీనటులు మారొచ్చు. కానీ అతని




లక్ష్యం వివక్షపై తిరుగుబాటు అలాగే కనిపిస్తుంది.

కథేంటంటే..

వందల ఏళ్ల క్రితం భూమికి మూలవాసులైన అడవిబిడ్డల నుండి భూమి ఎందుకు దూరమైంది? ముఖ్యంగా బంగారు గనులపై వారికున్న అధికారం క్రమక్రమంగా ఎలా కనుమరుగైంది అన్న అంశాలను ఈ తంగలాన్ చిత్రంలో చూపించారు. భూమి మీద హక్కు ఎవరిది? అన్న ప్రశ్న మనకు ఎన్నో సినిమాల్లో కనపడుతుంది. కానీ ఈ చిత్రంలో ఆ ప్రశ్న చుట్టూ అనేక దృశ్యాలను తెరకెక్కించిన తీరు మనల్ని చూపు తిప్పుకోనివ్వవు. 'తంగలాన్' అంటే బంగారం కొడుకు అని అర్థం. విక్రమ్ నటన ఈ సినిమా పేరుకి సరిగ్గా సరిపోతుంది. అంతలా తంగలాన్ పాత్రలో జీవించాడు.

ఈ చిత్రంలో ఎక్కడా కళ్లు మిరుమిట్లు గొలిపే కాస్ట్యూమ్స్ కనిపించవు. గోచీలు ధరించిన పురుష పాత్రలు, రవిక లేకుండా చీరనే ఒళ్లంతా కప్పుకున్న స్త్రీ పాత్రలు చాలా హుందాగా కనిపిస్తాయి. భూమికి యజమానులైన మట్టిమనుషులు, ఒంటినిండా బట్టలు కట్టుకోలేని పరిస్థితులను ఎత్తిచూపిన వైనం పా రంజిత్ తెగువకి నిదర్శనం. ఆ సన్నివేశంలో రవికెలు మొదటిసారి ధరించిన స్త్రీపాత్రలు పొందే ఆనందాన్ని వర్ణించడం కంటే చూస్తేనే ఆస్వాదించగలం. ఇలా మట్టి కొట్టుకుపోయిన మనుషులు, పూరి గుడిసెలు, గంజినీళ్ల కోసం అహర్నిశలు కష్టపడే శ్రమజీవులు.. ఇవే చిత్రం నిండా కనిపించే పాత్రలు. తనవారి బతుకులు బాగు చేయాలనుకునే ఓ నాయకుడు చేసిన సాహోసోపేత పోరాటమే ఈ 'తంగలాన్'.

బడుగు బలహీన వర్గాలకు భూమి ఎంత ముఖ్యమైనదో చెబుతూ ఈ సినిమాలో రంజిత్ చూపించిన తీరుకు హాట్సాప్ అనకుండా ఉండలేం. సొంతభూమిలో పండించిన పంట చేతికి రాకుండా జమీందార్లు కొల్లగొట్టినప్పుడు, పన్ను కట్టే నెపంతో వెట్టిచాకిరీ చేయించిన తీరు ఎన్నో చిత్రాల్లో చూసినా, అదేంటో ఈ సినిమాలో ఆ దృశ్యాలు చూస్తుంటే మనసంతా దు:ఖంతో బరువెక్కుతుంది. విక్రమ్‌కి జంటగా పార్వతీ తిరువోతు నటన ఈ చిత్రానికే హైలెట్. ఐదుగురు బిడ్డల తల్లిగా, భర్త ప్రతి కష్టంలో తోడుగా నిలిచే భార్యగా ఆమె నటించలేదు..



జీవించేసింది.

వాస్తవ జీవితాలే తంగలాన్

బంగారు గనులను తవ్వడం, అక్కడ జరిగే రాజకీయాలు, బలహీన వర్గాల వారితో వెట్టి చాకిరీ చేయించడం, తల్లి ప్రేమ, ప్రేయసితో ప్రేమాయణం వంటివి కెజిఎఫ్-1,2 చిత్రాల్లో చూసిన ప్రేక్షకులకి ఈ చిత్రంలో అంతకుమించిన సన్నివేశాలు కట్టిపడేస్తాయి. అయితే అవన్నీ థియేటర్లో మనల్ని కూర్చోనివ్వవు. తంగలాన్ ప్రపంచంలోకి తీసుకుని వెళ్లి మరీ చూపిస్తాయి.

ఈ చిత్రంలో పా రంజిత్ భూమి, బంగారం, వెట్టిచాకిరీ వంటి అంశాలను మాత్రమే స్పృశించలేదు. అప్పటి వాస్తవ జీవితాలను, సజీవ దృశ్యాలను కళ్లకు కట్టినట్లు చూపించాడు. బంగారు గనులను కాపాడే రక్షకురాలిగా మాళవిక మోహనన్ నటన గురించి చెప్పకోకుండా తంగలాన్ చిత్రం పూర్తవ్వదు. నాగుల రాణిగా ఆమెని చూపించిన విధానం ఔరా అనిపిస్తుంది. బంగారం కాపాడుకోవడంలో ఆమె చేసే ధీరోధాత్త పోరాటాలు చూపు తిప్పుకోనివ్వవు.

ఇలా ఈ చిత్రంలో ప్రతి పాత్ర దేనికదే ప్రత్యేకం. ఆనాటి సమాజంలో నిమ్నవర్గాల ప్రజలను యజమానులు ఎంతలా అణిచివేశారో ప్రతి సన్నివేశంలో కళ్లముందుంచారు. బుద్ధుని తల నరికే సీన్‌లో అయితే ఆ అంశం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సందర్భంలో చరిత్ర ఆనవాళ్లని ఎలా తుడిచేశారో ధైర్యంగా తెరకెక్కించిన పా రంజిత్‌ని మెచ్చుకోకుండా ఉండలేం.

నిర్మాత జ్ఞానవేల్ రాజా మంచి అభిరుచి గల నిర్మాతగా ఈ చిత్రంతో నిరూపించుకున్నారు. డబ్బు కోసం సినిమాలు తీయడం, టికెట్ రేట్లు పెంచమని వాళ్ల కాళ్లు, వీళ్ల కాళ్లు పట్టుకుంటున్న ఈ కాలంలో ఇలాంటి నిర్మాతలు రావడం శుభపరిణామం. వాస్తవాన్ని వాస్తవంగా, జీవితాలను సజీవదృశ్యాలుగా తెరకెక్కించే నేర్పు, ఓర్పు గల పా రంజిత్ మున్ముందు మరిన్ని మంచి కథలతో ముందుకు రావాలని ఆశిద్దాం.

యువ ఛాంప్ తన్వీ




- అండర్-15 విజేతగా తన్వీ పత్రి
- ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్

చెంగ్డూ (చైనా) : వరుసగా మూడు ఒలింపిక్స్‌లో (2012, 2016, 2020) పతకాలు అందించిన బ్యాడ్మింటన్.. 2024 పారిస్‌లో నిరాశపరిచింది. అయినా, యువ తరం మెరుపు ప్రదర్శనలతో భవిష్యత్‌పై భరోసా కల్పిస్తుంది!. ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్ (అండర్-15, అండర్-17)లో భారత యువ షట్లర్, 13 ఏండ్ల తన్వీ పత్రి చాంపియన్‌గా అవతరించింది. బాలికల అండర్-15 విభాగం సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో టాప్ సీడ్ తన్వీ పత్రి 22-20, 21-11తో వరుస గేముల్లో వియత్నాం షట్లర్‌ను చిత్తు చేసింది. టైటిల్ విజయం ప్రస్థానంలో ఐదు మ్యాచులు ఆడిన తన్వీ.. ప్రత్యర్థి షట్లర్లకు ఒక్క గేమ్‌ను సైతం కోల్పోకుండా పర్‌ఫెక్ట్ విజేతగా నిలిచింది. 34 నిమిషాల టైటిల్ పోరులో వియత్నాం షట్లర్ హ్యుయెన్ తొలి గేమ్‌లో 17-11తో ముందంజ వేసింది. వేగంగా పుంజుకున్న తన్వీ.. ప్రత్యర్థి పొరపాట్ల నుంచి సైతం పాయింట్లు దక్కించుకుంది. టైబ్రేకర్‌లో తొలి గేమ్‌ను సొంతం చేసుకుని ముందంజ వేసింది. రెండో గేమ్‌లో తన్వీ ఆది నుంచి ఆధిపత్యం చూపించింది. 21-11తో అలవోకగా రెండో గేమ్‌ను, ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. గతంలో ఇమద్ ఫరూకీ, తస్నీమ్ మీర్‌లు భారత్ నుంచి ఆసియా జూనియర్ చాంపియన్లుగా నిలిచారు. ఈ జాబితాలోకి తాజాగా తన్వీ పత్రి చేరిపోయింది. అండర్-17 బాలుర విభాగంలో జ్ఞాన దత్తు సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే.

ఆస్ట్రియాకు లక్ష్యసేన్

- రెడ్‌బుల్ అకాడమీలో ఫిట్‌నెస్ మదింపు



బెంగళూర్ : పారిస్ ఒలింపిక్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ.. పి.వి సింధు నుంచి మెడల్ ఆశించగా.. మెన్స్ సింగిల్స్‌లో లక్ష్యసేన్ పతకం దిశగా దూసుకెళ్లాడు. కాంస్య పతక మ్యాచ్‌లో పోరాడి ఓడి.. అడుగు దూరంలో ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ మెడల్‌కు దూరమయ్యాడు. పారిస్ ఒలింపిక్స్ ఓటమి నుంచి వేగంగా కోలుకుంటున్న లక్ష్యసేన్ ఈ సీజన్‌లో హాంగ్‌కాంగ్ సూపర్ 500, చైనా సూపర్ సిరీస్ 1000 టోర్నీలపై కన్నేశాడు. ఈ రెండు టోర్నమెంట్లలో టైటిల్‌పై గురిపెట్టిన లక్ష్యసేన్.. అంతకుముందు స్వీయ ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకోవటంపై దృష్టి సారించాడు. ఇందులో భాగంగా ఆదివారం ఆస్ట్రియాకు బయల్దేరాడు. అక్కడి రెడ్‌బుల్ అథ్లెట్ ఫర్‌ఫార్మెన్స్ సెంటర్‌లో లక్ష్యసేన్ ఫిట్‌నెస్ మదింపు జరుగనుంది. వారం రోజులు రెడ్‌బుల్ అకాడమీలో పరీక్షలకు వెళ్లనున్న లక్ష్యసేన్.. ఫిజికల్ ట్రైనింగ్, గేమ్ ఫిట్‌నెస్ మెరుగు పర్చుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు గాయాలకు గురవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అక్కడి నిపుణులతో సంప్రదింపులు జరుపనున్నాడు. ఈ మేరకు లక్ష్యసేన్ కోచ్ విమల్ కుమార్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. హాంగ్‌కాంగ్, చైనా సూపర్ సిరీస్‌లు సెప్టెంబర్‌లో జరుగనున్నాయి.

పాక్‌పై బంగ్లాదేశ్ విజయం

- రావల్పిండి టెస్టులో ఆతిథ్య జట్టుకు షాక్

రావల్పిండి : బంగ్లాదేశ్ బెబ్బులి గర్జించింది. పాకిస్థాన్‌పై తొలి టెస్టు విజయాన్ని నమోదు చేసింది. 14 టెస్టుల్లో పాకిస్థాన్‌పై విజయం కోసం పోరాడిన బంగ్లాదేశ్ చివరకు రావల్పిండిలో ఆ జట్టును చిత్తు చేసింది. బ్యాట్‌తో, బంతితో తిరుగులేని ఆధిపత్యం చూపించింది. 10 వికెట్ల తేడాతో తొలి టెస్టులో సూపర్ విక్టరీ సాధించింది. ముష్ఫికర్ రహీమ్ (191), మెహిది హసన్ (77), లిటన్ దాస్ (56), మోమినుల్ హక్ (50), ఇస్లామ్ (93) మెరుపులతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 565 పరుగుల భారీ స్కోరు సాధించింది. అంతకుముందు పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 448/6 పరుగులకు ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ఇచ్చింది. స్పిన్నర్లు మెహిది మిరాజ్ (4/21), షకిబ్ (3/44) మాయజాలంతో పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో 146 పరుగులకే కుప్పకూలింది.

30 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని బంగ్లాదేశ్ ఓపెనర్లు 6.3 ఓవర్లలో ఊదేశారు. జాకిర్ హసన్(15), ఇస్లామ్ (9) అజేయ ఇన్నింగ్స్‌లతో మెరిశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీ బాదిన ముష్ఫికర్ రహీమ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండు టెస్టుల సిరీస్‌లో బంగ్లాదేశ్ 1-0తో ఆధిక్యం సాధించింది.

ఇంగ్లాండ్ అలవోకగా..

తొలి టెస్టులో 5 వికెట్లతో గెలుపు

మాంచెస్టర్ : శ్రీలంకతో తొలి టెస్టులో ఆతిథ్య ఇంగ్లాండ్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 205 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జో రూట్ (62 నాటౌట్, 128 బంతుల్లో 2 ఫోర్లు), జేమీ స్మిత్ (39), హ్యారీ బ్రూక్ (32), డాన్ లారెన్స్(34) కీలక ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. 57.2 ఓవర్లలోనే లాంఛనం ముగించిన ఇంగ్లాండ్..మరో రోజు ఉండగానే విజయాన్ని అందుకుంది. శ్రీలంక వరుస ఇన్నింగ్స్‌ల్లో 236, 326 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 358 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ శతక హీరో జేమీ స్మిత్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-0 ఆధిక్యం సాధించింది.

అమ్మాయిలకు భంగపాటు

- భారత్, ఆసీస్-ఏ అనధికార టెస్టు

గోల్డ్‌కోస్ట్ : భారత్-ఏ, ఆస్ట్రేలియా-ఏ మహిళల జట్ల ఏకైక అనధికారి టెస్టులో ఆతిథ్య ఆసీస్ అమ్మాయిలు పైచేయి సాధించారు. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో భారత అమ్మాయిలకు భంగపాటు తప్పలేదు. ఆసీస్-ఏ వరుస ఇన్నింగ్స్‌ల్లో 212, 260 పరుగులు చేసింది. భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 184 పరుగులే చేసింది. 289 పరుగుల ఛేదనలో శుభా సతీశ్ (45), ప్రియా పూనియా (36), ఉమా చెత్రి (47), రఘ్వీ (26), సయాలి (21) మెరిసినా..92.5 ఓవర్లలో 243 పరుగులకే కథ ముగిసింది. 45 పరుగుల తేడాతో ఆసీస్-ఏ అమ్మాయిలు విజయం సాధించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68